UNIVERSAL LIBRARY
OU_204879
UNIVERSAL LIBRARY

OUP—552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T 83/ch 4 5D Accession No. T 3/50

Author

Title దేశ దర్శిని

This book should be returned on or before the date last marked below.

# దేశద్రోహి

కర్త :

శ్రీ జంపన చంద్రశేఖరరావు, ఎం.ఏ., బి.ఇడి.

లెక్చరర్ : పచ్చప్పాస్ కాలేజి, మదరాసు.

ఎడిటర్ : సూర్యప్రభ.

ప్రచురణం :

జంపన రామయ్యా అండ్ సన్సు,

జంపన బుక్ డిపో, ఏలూరు.

హక్కులన్నీ
గ్రంథకర్తవే.

వెల ఎనిమిది అణాలు

# I

"హత్య.....హత్య."

.....................

"హంతకుడు......హంతకుడు."

..........................

"పట్టుకోండి ... పట్టుకోండి."

ఆ నిశా ప్రశాంతాన్ని శకలాలుగా చీల్చి వేస్తున్నాయ్ ఆ కేకలు. హంతకుడు శరవేగంగా పారిపోతున్నాడు. కుందేళ్ళను, లేడిపిల్లలను తరిమే వేటకుక్కల్లా, హంతకుని తరుము కొని వెళుతున్నారు పోలీసులు. టార్చిలైట్లు ఫోకస్ చేస్తున్నారు. విజిల్స్ వేస్తున్నారు. నిదర పోయే వాళ్ళంతా లేచి ఖంగారు పడుతూ చూస్తున్నారు. ఎవరి ఇళ్ళ తలుపులు వారలి వేగంగా వేసేస్తున్నారు.

"కేచ్ హిమ్ ...... కేచ్ హిమ్"

రగ్గుల ముసుగుల్లోంచే కేకలు వేస్తున్నారు దొర చదువు చదువుకొన్న కామందులంతా.

హంతకుడు సందుల్లోంచీ పారిపోతున్నాడు.

అంతలో సినిమానుంచి వెళుతున్న వారి కారు ఒక సందు మలుపు నెమ్మదిగా తిరిగింది. వెంటనే ఒకే ఒక దూకు దూకి వెనుక చక్రం పట్టుకున్నాడు పాపం హంతకుడు.

కారులో ఉన్నావాళ్ళది చూడలేదు. కారు వెళ్ళిపోతూంది. కాని అతణ్ని తరుముకొని వస్తూన్న పోలీసులు చూడక పోలేదు. వెంటనే నలుగురూ నాలుగు టార్చిలైట్లు అతని వైపు వేస్తున్నారు.

"ఆపండి కారు... ఆపండి."

పోలీసు లలా కేకలు వేస్తూ పరుగు పెడుతున్నా కారు ఆగలేదు. వెళ్ళిపోతూంది.

పోలీసులు కారు నంబరు చూచారు. 4098 అని నోట్ చేసి కున్నారు. వెంటనే అతడెవరో తెలిసికున్నారు. నిజానికి 'దేశరక్షక పండిట్ జీ' గారిని తెలియని వారా పట్టణంలో ఎవరుంటారు. పోలీసులు వెంటనే మరొక కారు తీసి కొని వెళ్ళాలను కుంటున్నారు.

అంతలో పండిట్ జీగారి కారు 'శాంతినిలయం' ముందు నిలబడింది. సతీపతులిద్దరూ కారు దిగారు. గుమ్మందాటారు. తలుపులు వేయ బోతున్నారు.

అంతలో పండిట్ జీ గారి సతీమణి డాక్టర్ సుగుణ ఉలుక్కి పడింది.

"ఏం అలా ఉలుక్కి పడ్డావ్?"

భర్త ఆమెభుజంమీద చెయ్ వేసి అతికమ్మగా ప్రశ్నించాడు... ఇతడెవరు? ' అన్నట్లామె ఆతలుపు మూల వణుకుతూ నక్కిన హంతకుని చూపెట్టింది.

గదిలో ఉన్న ఎలక్ట్రిక్ లైట్లన్నీ ఒక్కసారిగా స్విచ్ వేసి వెలిగించాడు పండిట్ జీ. హంతకుని చేతుల నిండా నెత్తురు, బట్టల నిండా నెత్తుటి మరకలే.

పండిట్ జీ అతని వైపు తిరిచూచి నిర్ఘాంతపోయాడు.

"ఏయ్! ఎవరవోయ్ నీవ్"

"బాబయ్యా! రక్షించాలి. పోలీసులు తరుముకొని

వచ్చేస్తున్నారు," అతడు పండిట్‌జీ రెండు పాదాలమీదా కట్టెలా పడిపోయాడు.

"ఛా. ఆవలికిపో స్కౌండ్రల్. నిన్ను పోలీసులకు పట్టించకపోతే నేను పండిట్‌జీనే కాదు," అని సింహంలా గర్జించి తలపై ఒక్క తన్ను తన్నాడు.

హంతకుడు వణికిపోతూ "అమ్మా! రక్షించరా! మీ బిడ్డని కాపాడరా! ప్రాణాలు తీసేస్తారు. పోలీసులు వచ్చేస్తున్నారు' అంటూ మాధవి పాదాలమీద పడ్డాడు.

పాడారిపోయిన అతని కళ్ళు, అమ్మవారికి బలిచేస్తున్న తోటిమేకలను చూస్తూ వణికిపోయే మేకపిల్లలా వణికి పోతున్న అతని శరీరం తలుచుకొన్న మాధవిహృదయం మంచు కరిగినట్లు కరిగిపోయింది.

"పండిట్‌జీ, పాపి అయినా పాదాలంటి ప్రార్థిస్తున్నాడు. ప్రజా రక్షణే కదా మీదీక్ష. కాపాడరూ? పెద్ద పులులు తొరుముకొస్తున్నాయ్. లేడిపిల్లలా వణికిపోతున్నాడు. ...మీరు రక్షించకపోతే అతనికి మరణ శిక్షే...పాపం! కాపాడదామా?"

"ఎలా మాధవీ!"

"మీరు అజ్ఞ ఇస్తే, ఆభారం నాది."

"... ... ..."

"మాట్లాడరే!"

పండిట్ జీ ఆలోచనల్లో పడ్డాడు.

"అమ్మా! అమ్మా! రక్షించరూ! పోలీసులు...... వాళ్ళు...ఉరిశిక్ష...అమ్మా రక్షించరూ!"

పాదాలంటి ప్రార్థిస్తున్నాడు.

"పండిట్ జీ! వచ్చేస్తున్నారు పోలీసులు."

"అయితే నీయిష్టం."

"తలుపు వెయ్యండి."

పండిట్‌జీ మాట్లాడకుండా తలుపు వేసేశాడు.

మేడమీదకు వెళ్ళిపోతున్నాడు.

అంతే—

పోలీసులకారు గుమ్మంముందు ఆగింది. సబిన్స్పెక్టర్ తోసహా దిగారు.

"సార్...సార్."

"... ... ..."

"తలుపుతీయాలి...సార్..."

పండిట్ జీ మేడమెట్లెక్కకుండా దిగివచ్చాడు.

"ఎవరది?"

"తలుపు ఒకసారి తియ్యాలి."

"ఎందుకు తియ్యాలి."

"మీ యింట్లో..."

"ఆఁ"

"తలుపు తీయండి సార్ చెబుతాం."

పండిట్‌జీ అతి ఠీవిగా తలుపు తీశాడు, గెటువేశాడు. పోలీసులు లోపలికి వచ్చారు.

బహుశాంతంగా వారికి కుర్చీలు చూపిస్తూ తానొక సోఫాలో కూర్చున్నాడు.

"ఇలా అర్థరాత్రి వచ్చారే."

"తమరి కారిప్పుడే వెళ్ళింది కదూ!"

"అవును. పిక్చర్ నుంచి వచ్చాం. ఇప్పుడే వెళ్ళింది. పిక్చర్లకు వెళ్ళకూడ దని ఏమైనా ప్రభుత్వం వారు నూతన శాసనాన్ని అమలు పర్చారేమిటి?"

అతి హేళనగా ప్రశ్నించాడు సిగిరెట్టు ముట్టిస్తూ.

"ప్రజాక్షేమానికి, ప్రజాసౌఖ్యానికి, ప్రజాభ్యుదయానికి పాటుపడడమే ప్రభుత్వం వారి విధి. దానికి విరుద్ధంగా ఎన్నడూ చేయరు..."

"మీకు అలాగే అనిపిస్తుంది. దానికేం గాని ఏమైనా వారెస్టు వారుంటు తెచ్చారా నాకు?"

"ఉన్నా రాజకీయ ఖయిదీల తోటే ఉడికి పోతూంది దేశం. ఇంకా కొత్త ఖయిదీలా?"

"మరి."

"మీ యింట్లో ఒక హంతకుడు ప్రవేశించాడు."

"హంతకుడే."

"చిత్తం. అందుచేత మీ ఇల్లు పరిశోధించ డానికి వచ్చాం."

"మా యిల్లా?"

"అవును."

"మా యిల్లేమిటి? నన్ను కూడా పరిశోధించవచ్చు..."

అతడతి హేళనతో అనడం, సబిన్స్పెక్టర్ వక్కుమండడం, చేసేదేమీ లేక మేడ పరిశోధించడం జరుగుతూంది.

మేడమీద ఆమూల ఈమూల చూచారు. తరువాత మాధవిగది చేరారు. మాధవి వాకిటిజూబిలో నిలబడి దగ్గరకువచ్చింది.

"ఏం ఇలావచ్చారు?"

"హంతకుడొకడు మీగారు పట్టుకొని వచ్చాడండి."

"మీగారు పట్టుకొనే వెళ్ళిపోయాడేమో!"

"కావచ్చు."

"అయినా మీ వెట్టిగాని హత్యచేసిన వాడు ధైర్యంగా ఇంతవిశాల భవనంలో ఉంటాడా? మీలాంటి ఇద్దరు కాలక్షేపం చేస్తే ఆదురాస్త్రజ్ఞుడీపాటికి ఈవూరే దాటి పోతాడు."

"అవునమ్మా అవును."

"అయినా మా యింట్లోకి ఎలావస్తాడు? వస్తే వెంటనే పట్టి అప్పచెప్పం. పైగా హంతకుడాయె ... ... చూడండి చూడండి..."

మాధవి నిష్కర్షగా అంటూ ఉంటే వారికేమన్నా మాత్రం అనుమానం కలగలేదు. అటూ ఇటూ చూచి వెళ్ళిపోయారు.

తలుపు అతిదగ్గరాగా వేసి పండిట్ జీ పైకెక్కాడు.

"మాధవీ!"

"వెళ్ళిపోయారా?"

"వెళ్ళక... దేవిగారు దాచడం. ఆ రహస్యం మానవ మాత్రుడు కనుగొనడం కూడానా! అయినా రహస్యాలు దాచడంలో ఆడవాళ్ళు అందివేసిన చేతులు కదూ!"

"మీకంటేనా!"

"సరేగాని ఎక్కడ దాచావ్?"

"ఇంకెక్కడ! మీరు సన్యాసలింగం దగ్గర మొన్న చేయించిన పెద్దబీరువాలో" అంటూ ఆమె బీరువా తలు

వులు తెరిచింది. బీరువాలోనుంచి చెమట్లు కక్కుకుంటూ ప్రత్యక్షం అయ్యాడు హంతకుడు.

పండిట్ జీ అతడ్నిలా ప్రశ్నించాడు.

"బాబూ! హత్య చేసింది నీవేనా?"

"నేనే నండి."

"ఎవర్ని?"

"ఒక స్త్రీనండి."

"స్త్రీనా? ఓహో! అర్థం అయింది... ఆమెకూ నీకూ సంబంధం ఉందా?"

"ఉందండి."

"ఎంత కాలం నుంచి?"

"చాలా కాలం నుంచండి."

"అయితే అబ్బాయ్! ఆమెకూ మరొకరికీ ఈమధ్య కొంత సంబంధం కలిగి ఉండాలి—ఏం?"

హంతకుడేమీ మాట్లాడలేదు.

పండిట్ జీ అతనివృత్తాంతం అంతా గ్రహించినట్లు సిగరెట్టు ముట్టిస్తూ, మంచంమీద కూర్చొని "మాధవీ! చూచావా? 'స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః' అన్నారు. ఇతడ్ని ప్రేమించినట్లే ప్రేమించి ఆమె మరొకనితో ఉండబట్టేకదా ఇతడంత పనిచేయవలసింది...ఆకలికి అంతులేనట్లే, కామానికి అంతులేదు. నాలుక రుచికోరినట్లు, కామం రుచులు కోరుతుంది. క్రొత్తక్రొత్త రుచులకోసం ఎదురు త్రోవలు ప్రాకుతుందీ జిహ్వాచాపల్యం...కామంకూడా తనచూపును ఒక

శరీరాన్నుంచి మరొక శరీరానికి దుముకుతుంది. ఏమం టావ్?" అన్నాడు ప్రతి అక్షరం పట్టి పలుకుతూ.

"నిజమే... కామాంధుడు, త్రాగుబోతు, జూదరి, వేటకాడు, వంచకుడు... వీళ్ళకు కన్నులు కనబడవు. కళ్ళపై నీలిగుడ్డ జారి ఉంటుంది. మనసు వీళ్ళను బొమ్మలుగా ఆడి స్తుంది", అనిమాధవి జవాబు చెబుతూంటే మాధవినిప్రక్క మీదకులాగి "శభాష్! చక్కగా చెప్పావ్" అని వీపుతట్టాడు.

"పండిట్ జీ! ఆమె కామోద్రేకి. ఇతడు క్రోధోన్మ త్తుడు. ఇద్దరి తప్పులూ ఒక్కటే. యుగయుగాల నుంచీ స్త్రీ అంటే పురుషునకు లోకువ కాబట్టి ఆస్త్రీని ఇతడు చంపాడు. ఇప్పుడితనిని చంపించే దానికంటే మంచి త్రోవలో పెట్టడం మంచిది కదూ! "

"మాధవీ! నీయిష్టం...అయినా అతడిలా ఎంతకాలం దాగో గలడు? మనం మాత్రం ఎంతకాలం దాచగలం? " అంటుంటే " మహాశయా! మీరింక నన్ను దాచ నవసరం లేదు. నేను దాగో నవసరంలేదు. ఆమెను నేను చంపినపుడు, నేను శాశ్వతం బ్రతకాలని చంపలేదు. కాని చంపి తరు వాత, ఆరక్తపాతం నాలో ప్రతిరక్త కణాన్ని పరువులెత్తిం చాయ్. లేచాను. ఆమె గుండెలో రెండో మారు నాటిన కత్తిలాగాను. కత్తివెంటే నెత్తురు ధారగా జిమ్మింది. నాక ళ్ళు మూతలు పడ్డాయ్. దానితో ఎక్కడలేని భయం; ఆతృత; పిచ్చి నాచుట్టూ పోలీసులున్నట్లు భ్రమ నన్ను వెఱ్ఱి వానిని చేసింది. వెంటనే బయటకొచ్చి కత్తి వీధిలో పడేసి నేనే—పండిట్ జీ! నాయంతనేనే 'హత్య... హత్య' హంత

కుడు...హంతకుడు' అని కేకలు వేస్తూ వచ్చేస్తున్నా, అప్పుడు పోలీసులుచూచి నన్ను వెన్నాడడం ప్రారంభించారు. దానితో నాలో ప్రాణభీతి కలిగింది. ప్రాణాన్ని రక్షించుకోవాలనే ఆశకలిగింది...... పరుగుపెట్టా ...మీ కారు దొరికింది... ఇలా జేరాను... మహాశయా! ఇప్పుడు తెలుసు కున్నాను. నా బ్రతుకుపై అసహ్యించింది. హంతకుడు శిక్షార్హుడు. అతడు బ్రతుకరాదు... మీరు దేశభక్తులు. మీది పవిత్రగృహం. నాచే అపవిత్రం అయిపోయింది... ఏం చెయ్యను? నన్ను నేను మరచి పోయాను. క్షమించండి. నన్నుదాచే బాధ మీకు కాదు; భగవానునకు కూడా అవసరం లేదు. సెలవు. వెళు తున్నా. విధి మధ్యనిలబడి వారి కంట బడతా...నా అంతట నేను చావలేను కాని, ఒకరు నన్నుచంపితే చని పోవడానికి ఎంతో ఆనందంగా ఉంది... సెలవు... పాపానికి శిక్షతప్పదు. ఇప్పుడు కాకపోతే మరొకప్పుడైనా తప్పదు— హంతకుని వధించాలి" అంటూ కన్నులు నెత్తుటి ముకటల్లా వెలిగి పోతూంటే మేడదిగి పోయాడు వీధిగుమ్మం దాటబోయాడు. వెంటనే మాధవి 'బాబూ!' అని కేకలు వేసి, క్రిందకు వెళ్లి అతని చేయిపట్టుకొని పైకుతీసుకు వచ్చింది.

పండిట్ జీ ఆమె చర్యలకు ఆశ్చర్య పోతున్నాడు. ఇద్దరూ పైకివచ్చి అతనిముందు నిలబడ్డారు.

మాధవి అతనివంక జాలిగాచూస్తూ "బాబూ! నలుగురితో ఏమని చెబుతావ్?" అనిఅడిగింది. "హత్య చేసింది నేను ...నేనే హంతకుడను. పదిమాటలు నన్నడగకుండా నా ప్రాణాలు తీసివేయండి. అని చెబుతాను" అనిగంభీరంగా

జవాబు చెప్పాడు.

ఆ భార్యా భర్తలతని సాహసానికి ఆశ్చర్య చకితుల య్యారు. మాధవి దగ్గరకు వెళ్ళింది.

"బాబూ! నీవుహంతకుడవు కావచ్చు. కాని నీలో హంత కున కుండ వలసిన క్రూర బుద్ధిలేదు. పరిస్థితులే నిన్నా పాప కార్యాన్ని చేయించాయ్. ఆపరిస్థితులే నీమనో భావాలకు అనుకూలంగా ఉంటే మహత్తర కార్యాలు చేయగలవు. దాంట్లో సందేహంలేదు. మనంచేసే కార్యాల్లో తొంభైపాళ్లు ప్రతీది పరిస్థితుల మీదే ఆధారపడి ఉంటుంది......బాబూ? ప్రాణాలను అతిచులకనగా అర్పించడానికి సిద్ధపడ్డ ధీరుడవు. ఆ ప్రాణాలను అంతచులకనగా, అంతనిరర్థకంగా, అంతవ్య ర్థంగా బలిపీఠంమీద బలిచేసే దానికంటే — ప్రజలగురించి బలిసేయరాదూ? దేశానికి ఆర్పించరాదూ? అడవి కాసిన వెన్నెల్లా నీజీవితం వృధాసేయక, సద్వినియోగం సేయకూ డదూ? ఏటినీటిని పంటకాలువలకు ప్రవహింపజేస్తే ఫలవంత మైన సస్యాన్నిస్తుందిగాని, శ్మశాన భూమిలో స్రవింపజేస్తే ఏమిస్తుంది? మానవ జీవితానికంటే ఉత్తమజీవితం ఏముంది? అటువంటి ఉత్తమ జీవతం ప్రేళ్ళు నరికి, వృక్షాన్ని బొగ్గుల కొరకు అమ్ముకుంటావా చెప్పు? "

ఆమె మాటలకు అతనిలో ఎక్కడలేని పరిణామం కలిగింది. కళ్ళమ్మట నీళ్ళు జలజలా జారి పోయాయ్. కన్న బిడ్డ తల్లిదగ్గర తప్పుచేసి నప్పుడు నిలబడి నట్లు నిలబడ్డాడు.

''అమ్మా! మీరు చెప్పిందంతా నిజం. నన్నేదిచెయ్య మంటే అదిచేస్తా.''

"అయితే ఇదిగో — ఈఖద్దరు పంచి కట్టుకో " అని భర్త పంచి ఒకటిచ్చింది. అతడు వెంటనే తీసికొని "అమ్మా! నావల్ల మీకు లేని పోని కష్టాలొస్తాయేమో! " అన్నాడు. 'ఎన్నటికీ రావు. ముందు నేను చెప్పినట్లుచేయ్" అంటే అతడలాగే చేశాడు.

ఆ నెత్తుటి బట్టలుతీసికొని వంటింట్లో తగలపెట్టించింది.

"అమ్మా! బ్రతక మంటారా? "

"తప్పక. "

"ఎందు కమ్మా! "

"మహాత్మాగాంధీగా రెందుకు బ్రతికున్నారో అందుకు. ప్రజాసేవకు. సంఘంలో పాతుకు పోయిన కుళ్ళును పాకీ వానిలా కడిగి వేయడానికి. "

"ధన్యుడ్ని తల్లీ! " అంటూ—వణికి పోతూ. -అతడా మాట పూర్తి చేయకుండానే ఆమెపాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆతడామెను లేవనెత్తి ఒకమంచం మీద పండుకోమని, తనగదిలోకి వెళ్లి భర్తప్రక్కన పండుకుంది.

"ఏమిటాలోచిస్తున్నారు?"

"దొంగని నమ్మగలమా, అని."

"అతడు దొంగకాదు; మహాత్ముడు. "

"అందుకేనా ఈహత్య. "

"రోజుకు లక్షలాదిగా ప్రజలను యుద్ధమనే నెపంతో చంపే హిట్లరు, చర్చిల్, రూజువెల్టుల నేమంటారు?

"వీరు దేశాభ్యుదయానికి అలా చేస్తున్నారు.

"అతడే అభ్యుదయానికి ఆమెను చంపాడో చెప్ప గలమా? ఫలితాలు బట్టి కార్యాలు ఊహించ గలమా? కొందరు మహాత్ములు లా ప్రజలచే ఆరాధింప బడతారు— కాని వారు నిరంతరం చేసే దురంతాలు లోకానికి తెలుస్తున్నయ్యా? పండిట్ జీ ఎదటి హృదయాన్ని అర్థంచేసు కోలేం సుమా!"

"అలానే"

ఇద్దరి కళ్లూ తెరిచే ఉన్నాయ్.

ఒకరితో ఒకరు మాట్లాడు కోలేదు.

ఇద్దరి హృదయాలూ తీవ్రంగా స్పందిస్తూనే ఉన్నాయ్. కాని ఇద్దరి హృదయాలూ దగ్గరకు జేర్చుకోలేదు.

అతడటు తిరిగాడు.

ఆమె ఇటు తిరిగింది.

♦ ♦ ♦ ♦

"ఆ తల్లి ఋణం ఎలా తీర్చుకోగలను? నా ప్రాణాలను ప్రజల గురించి ఎలా బలిసేయ గలను? ......ఎంత పని చేశాను...హత్య...హత్య—హత్య."

అతడు కన్ను మూయ లేదు.

ఎలా మూస్తాడు—కత్తితో వచ్చిన నెత్తుటి జల్లు ఇంకా కనబడు తూంటే—

అతని కన్నుల నుండి నీళ్ళు జారిపోతున్నాయ్. కాని ప్రాణాలు విడిచిన అభాగిని ఎవరికొరకు ఏడుస్తుంది? ఏమిటో ఈ వింత ప్రపంచం...

♦ ♦ ♦ ♦

తెల్లవారింది.

మాధవీ పండిట్‌జీలు చెరొక సోఫాలో మేడ మీద కూర్చొని 'టీ' తీసుకుంటున్నారు.

"పండిట్‌జీ! రేపుసాయంకాలమే కదూ మీకు సన్మానం?"

"అవును మాధవీ! రేపే అఖండ సన్మానం."

"పదివేల మంది ముందు మీరంతసన్మానాన్ని పొందుతున్నారంటే అంతకంటే నాభాగ్యమేం కదా!"

"దానికేమిటి మాధవీ! నీవు నా అర్ధాంగివైనప్పుడు నాకు సన్మానం జరిగితే నీకూ జరిగినట్లే."

"కాని అంతలోనా!"

అతడు చిరునవ్వుతో ఆమెను చూశాడు. ఆమె సిగ్గుతో తలవంచుకుంది. నాలుగు నిమిషాలు గడిచాయ్.

"మాధవీ! ఏమి టాలోచిస్తున్నావ్?"

"ఏమీ లేదు గాని రాత్రి....."

"చెప్పు... చెప్పు"

"మొన్న సినిమాలో కనబడిన అమ్మాయి రిటైర్డ్ జడ్జీ గారి అమ్మాయా?"

"అవును."

"ఆమె పని?"

"దేశ సేవ."

"జీవితం గడపడం ఎలా?"

"ఆమెకేం మాధవీ? రెండు లక్షల రూపాయల ఆస్థిపరురాలు."

"బాగుంది. భర్తను పనేమిటి?"

"భర్తేమిటి? ఆమె పెళ్ళి చేసుకోలేదే. జీవితం అంతా దేశసేవలోనే వినియోగించాలనుకొన్న పుణ్యశీల."

"అలాగా...పెళ్ళి చేసుకుంటే దేశసేవ చేయడానికి వీలు లేదన్నమాట."

"వీలులేకే. ఉంది. కాని బ్రహ్మచారిణిగా ఉన్నప్పుడున్నంత వీలుండదు. కొంత భర్తసేవలో కాలం పోదు మరి!"

"ఓహో! అయితే మన కస్తూరిబా, సరోజనీ దేవి ఇత్యాదులంతా ఈమెలా సేవచేయలేదనుకుంటా."

"మాధవీ! భార్యా బిడ్డలూ ఉన్నా ప్రజాసేవ మరచిపోని గాంధీజీ...... భర్తా, గంపెడు సంసారం ఉన్నా దేశసేవ మరువని సరోజని దేవిలా అంతా ఉండగలరా? మహాత్ములకు సంసారం, చెరుకు పిప్పిలా, నిస్సారం. జీవితం, గడ్డి పరకలా, క్షణభంగురం. సామాన్యులకు అలాకాదు కదూ! శంకరాచార్యులు పాదరసం త్రాగారని శిష్యులు త్రాగగలిగారా? మహాత్ములు సంసారంలో ఉన్నా, అంటీ అంటకుండా, తామరాకుపై నీటి బిందువుల్లా గుంటారు. అంతా అలా ఉండగలరా? ...... మాధవీ! పర్వత శిఖరం నెమ్మదిగా ఎక్కగలం గాని,ఒక్కసారి ఎగరగలమా? మంచిపనులు చేయగా చేయగా మహాత్ములం కాగలం గాని, మడి కట్టుకొని మహాత్ములయి పోయామని చెప్పగలమా? ... ... ఏమంటావ్?"

"అలాగే. చెప్పలేం."

"అంచేత ఆమె వివాహం చేసుకుంటే, సంసారలంప

టంలో పడి తన విద్యుక్త ధర్మాన్ని మరచి పోతుందేమో నసే భయంచేత వివాహం చేసికోలేదు. అదితప్పా? ”

“కాదులెండీ, ”

“మాధవీ! లోకంలో చీకటివెలుగులు కలిసేఉన్నాయ్. మనదృష్టి చీకటివైపుకాక వెలుగువైపే ప్రసరించాలి. మంచి చెడ్డల కలియకే మానవ జీవితం. మానవుల మంచిని గ్రహించడమే మనపని గాని చెడ్డను గ్రహించడం కాదు. పాలూ నీళ్ళూ కలసి ఉన్నా, హంస పాలు త్రాగి నీళ్ళు విడిచి పెట్టినట్లే, మానవులలో మంచి గ్రహించి చెడ్డ విడిచి పెట్టాలి. ”

“అలాగే..... ”

మాధవీ! ముఖంపై క్రమ్మిన మబ్బులింకా పూర్తిగా పోనట్లున్నాయ్? ”

“నిజం...ఎలా గ్రహించారు? ”

“అదే సైకాలజీ. ”

“పోలేదు పండిట్‌జీ. సంశయాలింకాపోలేదు. స్వేచ్ఛవైపు తీవ్రంగా పరుగెత్తే ఈలోకం అడుగుల్లో అడుగులు వేసి రాలే పోతున్నాను. పడగలు విప్పి నాగుపాములు పరుగెడుతున్నట్లు. కాల ప్రవాహం కెరటాలు నురుగులు కక్కుతుంటూ పరుగెడుతూంది...ఎంత భయంకరంగా పొంగి పోతుందనుకున్నారు...పొంగుతూంది, అమావాశ్యను చూచో, పౌర్ణాన్ని చూచో తెలీదు. పండిట్‌జీ! ఆప్రవాహాన్ని ఈద లేపోతున్నాను. ”

“మాధవీ! భయపడకు...నీ సంశయం ఏమిటి? ”

“ప్రజాసేవకై పసుపు కంకణం కట్టుకొన్న ఆ పవిత్ర

చరిత్ర. ప్రజలు ఆకలిమంటలకు అల్లాడిపోతూ, స్వాతంత్ర్య ద్వారాలు తమంత తామే తెరుచుకొని ప్రవేశిస్తూంటే, ఆమె తన ధనం ప్రజలకు వ్యయంచేసి వారి ప్రాణాలు నిలవకుండా తన డబ్బు తన దగ్గర ఎలా దాచుకుంది? తిండిలేక బిడ్డలు చచ్చిపోతుంటే ఏకన్నతల్లయినా డబ్బుదాచుకుంటుందా? ఎక్కడుంది కరుణ? ఎక్కడికి దాచుకొంది ప్రేమ? ఇదేనా ప్రజాసేవ? ఇదేనా దేశసేవ? "

మాధవి ఉద్విగ్న హృదయిని అయిపోయింది.

అతడతి శాంతంగా సిగరెట్టు ముట్టించాడు.

"మాధవీ! ఒక్క ప్రశ్న? "

"ఏమిటి? "

"ఆమె తన రెండు లక్షలూ ఇస్తుందనుకో, దేశదారిద్ర్యం తీరుతుందా? "

"తీరదు. "

"మరింకే? ఆమె డబ్బువల్లే దేశ దారిద్ర్యం తీరితే అలాగే అందరకు పంచి ఇచ్చేదే."

"బాగు, బాగు. ఆమెలా ప్రతివారు తలో లక్షా లక్షా దాచుకొంటే దేశదారిద్ర్యం తీరుతుందా? పండిట్‌జీ... ఆ రెండులక్షలవల్లా కొన్నిప్రాణాలైనా నిలబడేవి అంటారా! లేదా!... మరో ప్రశ్న?"

"అడుగూ? "

"మీరిచ్చే ఉపన్యాసాలవల్ల దేశదారిద్ర్యం ఎంతవరకు తీరుతుం దంటారు? '

మాధవీ! దేశ దారిద్ర్యం ఒక్కనాటితో తీరేదికాదు,

కేవలం కొన్ని వేల ఉపన్యాసాలవల్లా, కొన్ని లక్షల దానాల వల్ల తీరదు. ప్రభుత్వవిధానం మారాలి. ప్రజాపరిపీడనం తగ్గాలి... దానికే మనం నడుంకట్టాలి...మాధవీ! పెరల్ బక్ చెప్పినట్లు స్వరాజ్యం వచ్చినా లాభం లేదు ; స్వరాజ్యాన్ని నిలుపుకొనే శక్తి ప్రజల్లో రావాలి. అలా కాక పోతే ప్రజలు దురాశాపీడుతులై ఒకరినొకరుదోచుకొని, ఒకరినొకరుచంపుకొని నశిస్తారు. స్వరాజ్యాన్ని మనంసంపాదించే ముందు, ప్రజలలో విజ్ఞాన బీజాలు నాటాలి. ప్రజాకర్తవ్యం అవగాహన అయ్యేటట్లు ఉపన్యాసాలివ్వాలి; గ్రంథాలు తేలిక భాషలో పల్లెలలోని పామరులకు కూడా అర్థం అయ్యేటంత సుభోధకంగా వ్రాయాలి; ప్రజాజీవితాన్ని ప్రతిబింబింపజేసే సాంఘిక నాటకాలాడాలి; చిత్రాలు తీయాలి; పాటలుపాడాలి—ఇలా ఎన్నో చెయ్యాలి ప్రజల మన స్తత్వం మార్చాలి. మనస్సులే కాదు, శరీరాలు కూడా మార్చాలి. ఒక క్రమశిక్షకు ప్రజలను తరిఫీదు చెయ్యాలి. అప్పుడు స్వరాజ్యం వస్తే ప్రయోజనం ఉంటుంది గాని అలా కాక పోతే సంక్షోభం తప్పదు... అంచేత ఉపన్యాసాల ఫలితం ఈనాడు కనబడక పోయినా ఏనాడైనా కనబడి తీరతాయ్. ఏమంటావ్? ”

“పండిట్‌జీ, మీరు చెప్పేది ఏదీ కాదనలేను, మీరు బాగా చదువుకున్నారు. విజ్ఞానవంతులు. మీవిజ్ఞానాన్ని ప్రజాభ్యుదయానికి వెచ్చించండి. సంతోషిస్తా కాని ఆవిజ్ఞానాన్ని వృథచేసి కపటనటకులుగా తేలకండి. గాంధీమహాత్మునిలా మనసూ, మాటా, చేతా ఒక్కటయ్యేటట్లుచూడండి.”

“దేవిగారి ఆజ్ఞ. ”

"కోపం వద్దు."

"కోపాలవల్ల, తాపాలవల్ల, కార్యాలు జరుగుతాయా? కార్యసాధనకు కావలసింది శాంతంకాని కోపం కాదుగా."

"అలాగేమరి."

గుమ్మంముందు కారాగింది 'మిస్. శారద' అనే విజిటింగ్ కార్డు సేవకుడు తీసుకు వచ్చాడు. అతడు చూచుకొన్నాడు.

"ఎవరీమె?"

"ఈమే రాత్రి..."

"సినిమాలో చూచినామే."

"అవునవును."

"ఊహూఁ"

"మాధవీ! నీవు లోపలకు—"

"వెళ్ళకేంచేస్తాను."

మాధవి లోపలకు వెళ్ళిపోయింది. ఎవరైనా వచ్చినప్పుడు మేడమీద ఎవ్వరూ ఉండరాదని ఆయన ఆజ్ఞ. అటువంటి రహస్య జీవితం అంటే మాధవికి మంట. కాని ఏంచేస్తుంది? అతడు భర్త; ఆమె భార్య. అతనిచేత ఆమె భరింపబడేదేకాని, ఆమెచేత అతడు భరింపబడేవాడు కాదుగా.

◆ ◆ ◆ ◆

శారద మేడపైకి వెళ్ళింది.

"నమస్తే పండిట్‌జీ!"

"నమస్తే శారదా!"

ఇద్దరూ గదిలోపల సోఫాలో కూర్చున్నారు.

సేవకుడు పళ్ళూ, ఫలహారాలు, కేకు, బిస్కెట్లు జాము, రొట్టె మొదలైనవి ఒక ట్రేలోనూ, కాఫీడికాక్షన్, పాలు, పంచదార మరొక ట్రేలోనూ తీసుకువచ్చి టేబుల్ మీద పెట్టాడు. పండిట్‌జీ సత్కారానికి ఆమె ఆశ్చర్యపోయింది. ఆనందంతో ఆమె ఆశావల్లరి ఒక్కసారి పుష్పించినట్లయింది- సేవకుడు గుమ్మందగ్గర నిలబడ్డాడు.

"పండిట్‌జీ ఇవన్నీ ఎందుకు? "

"అనుభవించడానికి. "

"అనుభవించడానికా? "

"ఆనందం ఆస్వాదించడానికి. నీవంటి విద్యావిశారద నా హృదయానికి హృదయం చేర్చి, భావాల నౌక పథంలో నడిపిస్తే, సృష్టినే ఆనంద నిలయం చేయనూ? "

"చేయనూ ఏమిటి? చేయాలనే నా కోరిక. పండిట్‌జీ! మీవంటి రసజ్ఞు లేర్పరచిన బాటపై ప్రయాణం చేయడం కంటే కావలసిందేముంది? చల్లని వెన్నెలకు కమ్మని తావిని ప్రసాదిస్తానంటే ఏ నిశాసుందరి వద్దంటుంది? పండిట్‌జీ! ప్రతి ప్రాణీ ప్రాకులాడేదెందుకు? ఆనందానికి కాదూ? అటువంటి ఆనందమే అబ్బుతుందంటే అరచేతి నుండి జారవిడిచే అల్పజ్ఞులుంటారా? "

"ఉండరు. "

"మరి. "

"మన మనోభావాలు ఏకం కావాలి. "

"అయ్యాయ్ అనుకోండి. తరువాత. "

"రసోపాసన; ప్రజాసేవ. అంతేగా మనకర్తవ్యం. "

"అంతే."

అతడు సిగిరెట్టు తీశాడు. అంటించాడు. జూటు మిల్లు గొట్టం చేశాడు. ఆమె ముఖంపైకి ఎగ బ్రాకుతున్నాయ్ పొగలు—తాముకూడా ఆమెను ప్రేమించినట్లు, ఇద్దరికాఫీలూ అయ్యాయ్.

"పండిట్ జీ! 'ప్రజాసేవకనిధి' కి ఇంకా ఎంత ఫండు కావాలి?"

"ఎంతైనా కావాలి శారదా! ఇప్పటికి నాలుగులక్షలు పోగడ్డాయ్ ఇంకా అధమం ఆరు లక్షలైనా పోగైతేనే కాని పని ప్రారంభించలేం."

"అలాగా!"

"అవును శారదా! ఎంత పని ఉందను కున్నావ్? ప్రతి పల్లెటూరులోనూ ఒక గృహపారిశ్రామిక నిలయం(Home for cottage industry) ఏర్పరచాలి. ఒక విద్యామందిరం నెలకొల్పాలి. ధర్మాసుపత్రి ఏర్పరచాలి. అలాప్రజలలో పరివర్తనం తీసుకురావాలి. మన స్తత్వాలు మార్చాలి. దేశ భక్తి నెలకొల్పాలి."

"అలాగే మరి."

"శారదా! ప్రతియింటా ఒక రాట్నం కాగాలుతీస్తూండాలి. ప్రతి స్త్రీ ఖద్దరు కట్టాలి. ప్రతి భారతనారీ తమ పసి పాపలకు పౌరుషరసం రంగరించి పోయాలి,"

"అలాగే మరి."

"ఒక టేమిటి శారదా! నీవునా నీడలా పని చెయ్యాలే గాని ఒక్కొవడాదిలో ప్రతియింటా ఒక గాంధీ మహాత్ముని తయారు చెయ్యనూ?"

"మీకు నీడగా ఉండటం కంటే కావలసిందేముంది!"

"ఏముందని మాటలంటే లాభంలేదు. మనకు కావలసినది కార్యాలు కాని కబుర్లు కావు."

"అలాగే మరి."

"మన దేశం ఎందుకు పాడైంది శారదా! అందరకూ ఆవేశం ఎక్కువ. ఆచరణ తక్కువ. అందుకని. తెల్సిందా!"

"చెప్పిం తరువాత తెలియకే."

"శారదా! మన సర్వస్వం దేశానికి ధారవోస్తే తప్ప మన మీ కార్యరంగంలోకి దిగకూడదు. నటనంటే నాకు అసహ్యం. పేరుప్రఖ్యాతుల గూర్చి పని చేయడమంటే నాకు రోత. నిష్కామసేవ చేయడమే నాకర్తవ్యం..."

"అలాగే మరి."

"నాతో చేయీ చేయీ కలిపి కార్యరంగంలో దిగితే. నాసర్వస్వం దేశానికి అర్పించినట్లే, నీవూ నీసర్వస్వాన్ని దేశానికి అర్పించాలి."

"తప్పకుండా. పండిట్‌జీ. దేశసేవ కంటే నాకేమీ ఆనందం ఈయలేదు. నాకిప్పుడు షుమారు రెండులక్షల రూపాయలకుపైగా ఆస్తిఉంది. అంతా మీ పేర పెడతా. దానిని ప్రజాసేవకై మీయిష్టం వచ్చినట్లు వినియోగించండి..."

"మాట తప్పవుకదా!"

"ఛా. ఛా."

"ప్రమాణంచేయ్"

"ప్రమాణంగా, మాతృదేశ సాక్షిగా."

అతని చేతిలో ఆమె చేయి వేసింది. ఆమె చేయి తన చేతులతో పట్టుకొని, ఆమెను తనదగ్గరకు తీసికొని 'జై! మహాత్మాగాంధీకి జై! వందేమాతరం' అన్నాడు అరమోడ్పు కనులతో.

ఆమె హృదయం ఝల్లు ఝల్లుమంది.

ఆమె ప్రతిరక్తకణంలోనూ ఎవరో నవచైతన్యం పోస్తున్నట్లయింది. ఆమెహృదయం అతితీవ్రంగా స్పందించిపోతూంది. దేశంగురించి ఏదైనా చెయ్యాలనే సంకల్పం దృఢం అయి పోయింది.

"శారదా!"

"పండిట్‌జీ! నాఆస్తి మీఅధీనం చెయ్యడం లేదు. నా జీవితం—నా సర్వస్వం మీ ఆధీనం చేస్తున్నాను..."

"శారదా!"

అతడామె కన్నులలోకి వెన్నెల జిమ్మినట్లు అతి నిశితంగా చూచాడు. ఆమె హృదయంలో ప్రేమ సముద్రం పొంగులు పొంగింది. నురగలు క్రక్కింది.

"పండిట్‌జీ!"

"శారదా! ధన్యుణ్ని. ఒక్కమాట."

"చెప్పండి. మీరు చెప్పడమే ఆలశ్యం, ఆపని అయినట్లే భావించండి."

"మన ప్రజాసేవకు ప్రజలు మెచ్చుకొని హై మరచి, సభల్లో 'కస్తూరిబా గాంధీగార్లలా, శారదా పండిట్ జీలు

ప్రజాసేవ చేస్తున్నారని' మనల గురించి చెబితే అన్యథా తలచవుకదా!"

"అన్యథా తలచడం ఏమిటి? అలాగే మనం ఎందుకుండకూడదు?"

"నా అభ్యంతరం ఏముంది?"

"మీకు అభ్యంతరం లేకపోతే నాకా అభ్యంతరం"

ఆమె నవ్వుతూ అతనివంక చూచింది. అతడానందంతో ఆమె వీపు చరుస్తూ "శారదా! ఏమిటో అనుకున్నాను. బలే అసాధ్యురాలవే" అని నవ్వుతూ ద్వారంవైపు బయలుదేరాడు. 'ఇంక తమరు దయచెయ్యండి' అన్నట్లు ఆమె లాభంలేదని సెలవు తీసుకొని బయులుదేరింది.

♦ ♦ ♦ ♦ ♦

శారద కారు వెళుతూంది.

ఆ కారు వెనుకే కనకమ్మగారి కూతురు అమ్మన్నగారి కారు ఆగింది. కారులోంచి అమ్మన్న స్నేహితురాలు లక్ష్మి దిగి అతి దర్జాగా మేడ మెట్లెక్కుతూ "సుబ్బా! అయ్యగారున్నారా? వెళ్ళవచ్చునా?" అని ప్రశ్నించింది అక్కడున్న సేవకుని. అయ్యగారున్నారని ఆమె వెళ్ళవచ్చునని తెలిసికొని మేడ మెట్లెక్కింది.

గదిలో పండిట్‌జీ లక్ష్మిలు ఒక సోఫాలో నవ్వుతూ కూర్చున్నారు.

"పండా, కాయా?"

"మీరు ప్లేట్ వేయడం, కాయ అనడం కూడానా?"

"ఏమయింది? వస్తానందా?"

"వచ్చేటంతవరకు వచ్చింది కాని..."

"ఏం? ఆ పాడుముసలిపీనుగు తల్లి అనుమానించిందా?"

"అనుమానించకపోతే ఆమెను ఈసరికి నీ వళ్ళో పడేటట్లు చేయకపోదునా?"

"అదేమిటి నీముఖం? ఆమె నావళ్ళో పడడం ఏమిటి? ఆమె ఎవరికి కావాలి?"

"ఆమె కాదు; ఆమె ధనం. సరా?"

"అంతే. మనకు కావలసింది ప్రజాసంరక్షణ నిమిత్తం కాంచనమే కాని కాంతలుకారు."

"నాకు తెలీదూ?"

"తెలుసును గాని—ఏం జరిగిందో చెప్పలే?"

"పండిట్‌జీ! ఆత్రుతపడక. ఇవాళ రెండోఆట సినిమాలో కలుసుకుంటానంది. అక్కడ..."

"అక్కడమాత్రం ఆ ముసలితల్లి దాపురం కాదూ?"

"కాదు. అమ్మాన్న ఒంటరిగానే వస్తుంది. అప్పుడు మీ ప్లేన్ చెప్పండి."

"ఒప్పుకుంటుందంటావా?"

"మీరు వల వేయడం. పిట్ట పడకపోవడంకూడానా!"

ఆమె పక్కుమని నవ్వింది.

అతడామెను అక్కునకు చేర్చుకున్నాడు.

ఇద్దరు గాఢాలింగనంలో ప్రపంచాన్ని మరచారు.

ఆ దృశ్యాన్ని అద్దంలోనుంచి చూచిన మాధవి హృదయం అగ్నిపర్వతం అయిపోయింది. ఏం చేస్తుంది పాపం! భర్త-పై పెచ్చు ప్రజాసంరక్షకుడు! —

"పూలను కూర్చి మాలికలల్లి భారతమాత కంఠాలం కృతం చేస్తాడనుకున్నా. పూల హృదయాలు చిదిపే పాతకి అవుతా డనుకోలేదు. దేశభక్తి ఇదేనా? దేశభక్తులకు గంభీరోపన్యాసాలే కాని సత్యప్రవర్తన అవసరంలేదా?" అనుకుంటూ మాధవి వెళ్ళిపోయింది.

ఏమిటో ఈక్షణిక ప్రపంచ రంగంపై మాయానాటకాలు!!! దేశభక్తి పరజాలు!!!

♦ ♦ ♦ ♦ ♦

## III

హంతకుని పేరు గోవిందయ్య.

మాధవి బంధువని నలుగురితోటి చెప్పింది.

గోవింద్ మీద ఒక్కరూ అనుమాన పడలేదు.

గోవింద్ వచ్చి నెలదాటింది. అంతకంటె భక్తుడు, నమ్మదగినవాడు లేడని మాధవి. దొంగను నమ్మడంఎలా? అని పండిట్ జీ. గోవింద్ లేకపోతే నేను బ్రతకలేను అంటుంది మాధవి. గోవింద్ ఉంటే మనబ్రతుకు బండలవాలే అంటున్నాడు పండిట్ జీ.

'గోవింద్ ఎవరు? ఎవరిని హత్యచేశాడు? ఎందుకు అహత్యచేశాడు? హంతకుడెన్నడైనా మంచివాడుకాగలడా నే విషయా లెవరికి అర్థంకావడంలేదు. కాని కాలం కదిలిపోతూంది, మల్లెపూల రేకులపై జారే మంచు బిందువుల్లా.

♦ ♦ ♦ ♦ ♦

పండిట్‌జీ అమ్మన్నతో షికారు వెళ్ళాడు.

లక్ష్మి ఎవరో 'రావు' అనే దేశభక్తునితో వచ్చింది. పండిట్‌జీ లేకపోవడంచేత వచ్చినత్రోవను వచ్చినట్లే వెళ్ళిపోయింది. మాధవితో రెండునిమషాలు మాట్లాడకూడదూ! మాధవిలో దేశభక్తి అణుమాత్రం కూడా లేదా?

♦ ♦ ♦ ♦

లక్ష్మి వెళ్ళిపోయింది. తన ప్రియ మిత్రునితో.

వెంటనే శారద వచ్చింది. ఆ దేశోద్ధారిణి పండిట్‌జీ లేడని గుమ్మందగ్గర తెలిసికొని, గుమ్మం ఎక్కకుండానే వెళ్ళిపోయింది కారులో.

అలా ఎందరో వస్తున్నారు. అందరూ వెళ్ళిపోతున్నారు వాళ్ళ చర్యలు చూస్తూన్న మాధవి హృదయం రోజుకు రోజుకు క్రుంగిపోతూంది. పరాభవం సహించలేక పోతూంది. జీవితం శిథిలమై పోతూంది.

♦ ♦ ♦ ♦ ♦

'ఏ నూతిలో నైనా పడి ఎందుకుచావకూడదు! భర్త దగ్గర సహధర్మచారిణిత్వం పొందని సతిజన్మ ఎందుకూ?' అనుకొని క్రుంగి క్రుంగి ఏడ్చేది.

ఆరోజు ఆమెముఖం చూస్తున్నగోవింద్ కన్నీళ్ళు కార్చకుండా ఉండలేక పోయాడు. అతని కన్నీళ్ళు చూచిన ఆమె కలత చెందక పోలేదు.

"గోవింద్! అలాకూర్చో."

"పరవాలేదులే తల్లీ!"

"ఎందుకోయ్ కన్నీళ్ళు!"

"సరస్వతి దీనంగా ఉంటే హృదయం కరిగేటట్లు కన్నీరు కార్చాడు పోతన. భారతమాత ఇనుప సంకెళ్ళలో బాధపడుతుంటే గుండెబద్దలయ్యేటట్లు వెక్కి వెక్కి ఏడ్చాడు శివాజి. తెలుగుతల్లి శిరిపం ఎత్తుతుండంటే దిక్కులన్నీ కన్నీటి పాత్రతో కలయ నెతికాడు శాంతికై మన త్యాగయ్య. మాతృదేశం. బానిసత్వంలో కుళ్ళిపోతుందనేగా వలవల యేడుస్తున్నాడు గాంధీజీ. తల్లి ముఖం వాడిపోతే ఏడవని కొడుకుంటాడా? ఉంటేవాడు కొడుకేనా!"

అతనిమాటలు వింటూన్న మాధవి హృదయంలో శాంతిదేవత వీణవాయిస్తున్నట్లుంది. అతని అభిమానానికి విశ్వాసానికి ఆశ్చర్యపోయింది.

"గోవింద్ తెరలు తీసినకొలదీ నీహృదయంలో జాలిగొలిపే చిత్రాలు వేలకువేలు కనుపించేటట్లున్నాయ్."

"అలాగే తల్లీ!"

"నీకు మాయందున్న విశ్వాసం పండిట్‌జీకి దేశం పై ఉంటే బాగుండును."

"బాగానే ఉంటుంది. కాని లేదు కదమ్మా!"

"లేదంటావా?"

"ఈషణ్మాత్రం లేదుతల్లీ! దేశభక్తి లేకపోతే పరవా లేదు; కాని తేనెపూసిన కత్తికారాదు కదమ్మా?"

"అవును...ఇప్పుడే?"

"ఏముంది? ప్రవాహంలోపడ్డారు. అదిరాళ్ళగుట్టలూ, ముళ్ళకంచలూ దాటించి దాటించి మహాసముద్రంలో కలిసే

వరకూ ఆగుతుందా? సుడిగుండాలలో పడకుండానే ఉండాలి కాని, పడితే ఇంకేముంది అడుక్కి వెళ్ళిపోం."

ఆమె వెఱ్ఱిగా చూచింది. గోవింద్ చెప్పిన భావం ఆమె కేమీ అర్థం కాలేదు.

"గోవింద్! ఏమిటి నీ భావం? ఆయన ఇంకా ఏమైనా దురంతాలు చేస్తున్నారా?"

"అంతుందామ్మా దురంతాలకు?"

ఆమె నాలుగువైపులా చూచింది. అతనికీ దగ్గరగా సోఫా జరుపుకూంది.

"గోవింద్! ఆయన దురంతాలు ఎంతవరకువచ్చాయ్."

"నేను చెప్పినా నమ్మనంతవరకూ వచ్చాయ్."

ఆమె అలాగే కుర్చీకి జేరబడిపోయింది. రెండు నిమిషాల వరకూ యేమీ మాట్లాడ లేపోయింది.తరువాత రెండు పెద్ద నిట్టూర్పులు విడిచి "బాబూ ! గోవింద్ ! ఆయన కష్ట సుఖాలు మనవి కాని ఇతరులవి కావు. ఆయన పాపపుణ్యాలూ మనవే. అందుచే ఆయన త్రోవ తప్పితే త్రోవ చూపించ వలసిన బాధ్యత మనది. అందుచేత నాదగ్గర యే రహస్యం దాచక, నా హృదయం దెబ్బతిని, చిదికిపోయి, కమిలి. నల్ల బడుతుందని భయపడక, యేంచేశారో చెప్పు... చెప్పకపోతే నామీద వట్టే"అంటుంటే పొడారి పోయిన ఆమె కన్నులపై నుంచి కన్నీటి తడి ధార కదలిపోయింది. గోవింద్ హృదయం చెదిరిపోయింది.

"అమ్మన్నగారు తెలుసునా అమ్మా!"

"ఆగర్భ శ్రీమంతురాలని విన్నాను. మనిషిని చూచాను, కాని ఆమెతో మాటాడలేదు."

"ఆమె తండ్రిగారు మరణించారని తెలుసునా?"

"విన్నాను."

"ఆమె ఆస్తికంతా ఆమె తల్లిగారైన కనకమ్మగారు హక్కుదారి."

"అవు నవును. అయితే..."

"ఆమె ఈ మధ్యే మరణించిందని విన్నారా?"

"వినకే, దేశం అంతా చెబుతుంటూ ఉంటే."

"తల్లీ! ఆమె అందరిలా చావలేదమ్మా!"

"చావలేదూ?"

"లేదు. చావలేదు. చంపించారు."

"ఎవరు?"

"ఇంకెవరు? మనవారే!"

"ఆఁ మనవారా! ఎలా?"

"విషం పాలల్లో కలిపి."

"విషమా?"

"అవును తల్లీ!"

"నలుగురికీ తెలియలేదూ!"

"అమ్మా! గుప్పెడి పెద్దదయిన కొద్దీ వస్తువు లెక్కువ దాగుంటాయ్. గొప్పవారు చేసే హత్యలు హత్యలు కావమ్మా: ధర్మకార్యాలు. వారు చేసే వ్యభిచారాలు వ్యభిచారాలు కావమ్మా; ప్రేమకార్యాలు. వారు త్రాగే బ్రాందీ తాగుడు కాదమ్మా; మధు రసాస్వాదనం. వారాడే జూదం జూదం

కాదుతల్లీ ; ధర్మజూదం...వారు చేసే పనులే మావంటి పేద వారు చేస్తే లోకం—హంతకు లంటుంది; కాముకు లంటుంది; త్రాగుబోతు లంటుంది; జూదరు లంటుంది. తాను తిడు తుంది; ఇతరులచేత తిట్టిస్తుంది.

గొప్పవారు చేసే హత్యలు బంగారపు ముసుగులో జరుగుతాయమ్మా! ఆ రహస్యాలు చూడ్డానికి లోకానికి కళ్లు లేవు; వినడానికి చెవులు లేవు;భావించడానికి హృదయం లేదు. లోకం గొప్పవారి పట్ల మూగది. నాలుకదాటి ఒక్క చెడ్డ మాట జారనీయదు. పేదవారి పట్ల పెనుభూతం."

"గోవింద్! ఏమిటీవింత-ఇదంతా నీకెలా తెలిసింది?"

"ప్రభువుగారూ ఆ అమ్మగారూ మాట్లాడుకుంటూ ఉంటే విన్నా.విషం లక్ష్మిచేతి కిచ్చి పంపిస్తూంటే చూచా."

"వీరిని జేర్చింది లక్ష్మా!"

"అదేనమ్మా ఆమెవృత్తి. వారినీ వీరినీ తార్చడం. దేశోద్ధారిణి కావడం. ఇటువంటి చీడపురుగుల వల్లే దేశం నాశం అవుతూంది. మహాపవిత్రసంస్థ అయిన కాంగ్రెసుకు అపఖ్యాతివస్తూంది. పునాదులులేని సౌధం అయిపోతూంది మహాత్ముని ఆశాసౌధం. వ్రేళ్ళుతెగిన మహావృక్షం అవు తూంది జవహర్‌లాల్ స్వతంత్ర వృక్షం."

"ఈవిషయం లోకానికి తెలియదంటావా!"

"ఇంకేం తెలుస్తుందితల్లీ! ఆమె శవం దహనం అయి పోయి, బుగ్గి బుగ్గిలో కలిసిపోతే."

"ఊహూఁ"

"వేలు కుమ్మరించారు. కార్యం సాధించారు అప్పుడే అయిందా తల్లీ! ఇంకా వారి జీవితాల్లో ఎన్ని విచిత్రఘట్టాలు రానున్నవో... దేశభక్తి అనే ముసుగు వేసి ఆ ముసుగులో ఎందరు శారదలు ధనరాసులు కుమ్మరించారో, ఎందరు తమ పవిత్రశీలాన్ని కామాగ్నిలో ఆహుతి చెయ్యాలో, ఎన్ని కాపరాలు కూలాలో, ఎన్ని కన్నీళ్ళు రాలాలో......"

ఆమె కన్నీళ్ళు తుడుచుకుంటూంది.

మాధవిని చూచాడు మారుమాటలేదు.

"గోవింద్! హృదయంలేని రాతిని పిండితే కన్నీటి బొట్లు రాల్తాయా? నెత్తుటి బొట్లు జారతాయా? హృదయం లేదు పండిట్‌జీకి నాలుకనుండి జారే విజ్ఞాన బీజాంకురాలు నిర్జీవాలు. లోకం అంతా తననొక మహాత్మా గాంధీగారంటున్నారని సంతోషిస్తున్నారే కాని, లోకాన్నెలా వంచిస్తున్నారో ఊహించడంలేదు.

"లేదు తల్లీ! లేదు."

"గోవింద్! వారి నింక సత్పథంలో పెట్టడానికి వీలు లేదంటావా? వారి మనసు మార్చలేమంటావా?"

"ఏమోనమ్మా! మనసు మారితే కావలసిందేముంది? మనసు కుక్కతోకవంటిదమ్మా! దాని సహజత్వం వంకరగా ఉండడంతప్ప, తిన్నగా ఉండడంకాదు. మనసు నాగుపాములా వంకర్లు వంకరుగా పరుగెడుతుంది. చుట్టలుచుట్టలుగా చుట్టుకుపోతుంది. పాము పడగపైనున్న మణి విలువ దానికి తెలియనట్లే, మనసు శిరసుపై వెలిగే బుద్ధియొక్క విలువ దానికి తెలీదు......మనిషిని కీలుబొమ్మచేసి ఆడించేది, నవ్వించి

యేడ్పించేది, పుణ్య పాపాలని విరపించేది, స్వర్గ నరకాలను నిర్మించేది, మంచి చెడ్డలను కల్పించేది మనసే కదమ్మా! మనసును బట్టే మనిషి విలువ. మన మనసు మన స్వాధీనంలో ఉంటే మహాత్ములం అవుతాం. మనం మన మనసు స్వాధీనంలో ఉంటే పిశాచులం అవుతాం......మనసును జయించామా అన్నిటిని జయించినట్లే. మనసుకు లొంగామా ప్రతి ప్రాణికి లొంగిపోతాం..."

"బాగా చెబుతున్నావ్ బాబూ! ముక్తికి రాజమార్గం ఇంద్రియ నిగ్రహమే."

"రాజు లొంగిపోతే ప్రజలు లొంగడం ఎంత తల్లీ! ఇంద్రియాలకు రాజైన మనసు లొంగిపోతే, ఇంద్రియాలను జయించడం ఎంత ?"

"ఎలాగైనా ఇంద్రియ విజయం బహుకష్టసాధ్యంకదా గోవింద్!"

"ఎన్నటికీ కాదమ్మా! శ్రీ అరవిందఘోష్ మహాశయులు చెప్పినట్లు—చూచేవన్నీ మంచిదృశ్యాలేచూడాలి; అప్పుడు చక్షురింద్రియం శక్తి తగ్గిపోతుంది. వినే వన్నీ మంచి మాటలే వినాలి; అప్పుడు శ్రవణేంద్రియం శక్తివిహీనం అవుతుంది. వాసన చూచే దంతా సుగంధ పరిపూరితమైనదే వాసన చూడాలి; అప్పుడు ఘ్రాణేంద్రియం మన స్వాధీనంలో ఉంటుంది. అలాగే గాంధీమహాత్ములు చెప్పినట్లు అన్నింటికంటే బలవత్తరమైన జహ్వాచాపల్యా అరికట్టాలంటే మాంసాహారం కాక, కేవలం సాత్వికాహారమే భుజించాలి. అప్పుడు జిహ్వేంద్రియం అల్లరు అణిగి పోతాయ్. ఈ విధంగా

ఇంద్రియ చతుష్టయాన్నీ జయిస్తే పంచమ ఇంద్రియమైన మనసు శక్తి విహీనమై, మనకు స్వాధీనమై, మనం ఎలా చెబితే అలా నడుస్తుంది. నాలుగు మూలల నుంచీ వచ్చే నీరు ఆగిపోతే చెరువు వేసవి ఎండలలో ఎలా ఎండి పోతుందో, అలాగే నాలుగు ఇంద్రియాల సంక్షోభం అరికట్ట బడితే, మనసు ఎండు టాకువలె రాలిపోతుంది. అపుడు బుద్ధి బలం హెచ్చుతుంది. ఆత్మజ్ఞానం అలవడుతుంది. గాంధీ గారు చెప్పే అంతర్వాణిని ఆనాడు వినగలం. నాటినుండి మన జీవన రథప్రయాణం శాంతి స్వతంత్రాల వైపు, అభ్యు దయ ఆనందాల వైపు సాగుతూంటుంది."

అతనిమాటలు వింటూఉన్న ఆమెఆశ్చర్యం వర్ణించలేం- ఆమెకే తెలియని ఎన్నో విషయాలతడు చెబుతున్నట్లుంది. నెమ్మదిగా ఆశ్చర్యంతో ఇలా ప్రశ్నించింది.

"బాబూ! నీవు హంతకుడవా?"

అతడు తలవంచుకొని నిలబడ్డాడు.

"నిజంగా నీవు హంతకుడవా గోవింద్?"

"హంతకుడనే తల్లీ! నాచేతులతోనే నేను హత్య చేశాను. నిండుప్రాణాలు తీసివేశాను. ఏ అర్ధరాత్రి వేళో నాపాపపు కృత్యాలు జ్ఞాపకంవస్తే, నాహృదయం ఎంత ఏడుస్తుందో చెప్పలేను. అసలు నేను బ్రతికిఉండడం చావగల శక్తిలేకగాని, బ్రతకాలని ఆశచేతకాదు. అమ్మా! ఈపాపి జీవితగ్రంథంలో ప్రతిపుటా నెత్తుటి మరకలతో నిండిపోయిం దమ్మా!"

అతనిగొంతుక బొంగురుపోయింది. పైనున్న రుమాలుతో కారేకన్నీరు తుడుచుకుంటున్నాడు. అలా ఒక్క నిమషం ఉన్నాడు. ఇంకక్కడ ఉండలేక బయలుదేరాడు.

"ఏం గోవిందూ! వెళ్ళిపోతున్నావ్?"

"నా గొంతుకే నానుండి వేరైపోయినంత బాధగా ఉందమ్మా! నిలబడలేను...బాబును మాత్రం వేయికన్నులతో కాపాడుకోండి."

"నీవో?"

"నేనింకా బ్రతికున్నది మీఆనందం కొరకేనమ్మా! అవసరం వస్తే నా ప్రాణాలైనా అర్పించి బాబును రక్షించుకుంటా; మీ ఆనందాన్ని గురించి ఏదైనా చేస్తానుతల్లీ!..."

అతడు తలవంచుకొని కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

"గోవింద్ హంతకుడు, పండిట్ జీ హంతకుడే. కాని గోవిందుని లోకం దండిస్తుంది; నిందిస్తుంది. పండిట్ జీని లోకం శిక్షించదు; పూజిస్తుంది. శాసనం కూడా పేదలయెడ పదునుగా ఉంటుంది. పెద్దలయెడ బండవారుతుంది. న్యాయాన్యాయాలు, ధర్మాధర్మాలు కూడా ధనరాసులమీద ఆధారపడి ఉంటే, శాంతి అహింసల కింక స్థానం ఎక్కడుంటుంది?"

అలా ఆలోచనల్లో పడిపోయింది మాధవి.

♦ ♦ ♦ ♦ ♦

## IV

రాత్రి ఒంటిగంట అయింది.

కారు గుమ్మం ముందు ఆగింది,

పండిట్‌జీని దింపి, అమ్మన్నగారు తన భవనానికి వెళ్ళిపోయారు.

అతి దర్జాగా విజిల్ వేసుకుంటూ పండిట్‌జీ మేడ క్కాడు. కోటుతీసి తన ముఖాం, ఎలిక్ట్రిక్ లైట్ల కాంతిలో, అద్దంలో చూచుకుంటున్నాడు. కాని తన ప్రక్కనే తిండి తిప్పలేక కుర్చీలో క్రుంగి క్రుంగి కుళ్ళిపోతున్న అర్థాంగిని చూడలేదు. ఆ గదిలో నున్న డ్రాయిరు తీసి దానిలోని బ్రాందీసీసా తీసి. గ్లాసులో వేసికొని గడగడ త్రాగివేశాడు. బోటిల్ లోపలపెట్టి భార్యాను పిలుద్దామనుకున్నాడు. కాని ఆమె అక్కడే ఉండి అతని రహస్యచిత్రాన్నంతా చూస్తుందని ఎలా అనుకోగలడు? ఆయన ఆజ్ఞలేనిదే ఆమె కాదు భగవంతుడు కూడా ఆ గదిలోకి రాకూడదుగా......

తాగిన మత్తు తగ్గక మునుపే ఒక నిట్టూర్పు వినబడింది. తల త్రిప్పి చూచాడు. ఇంకేముంది? తన అర్థాంగి మాధవి ఈమణ్మాత్రం చలించకుండా, దగ్గరకు వెళ్ళి "మాధవీ! ఇక్కడున్నావే?" అని ఎంతో అనురాగంతో ప్రశ్నించాడు.

మాధవి లేచి నిలబడి "క్షమించండి. మీగది పూలతో అలంకరిద్దామని సాయంకాలం తమరి ఆజ్ఞ తీసికోకుండా స్వతంత్రించి వచ్చాను. అప్పటినుంచి ఇప్పటివరకూ అనుకోకుండా కళ్ళు మూసుకుపోయాయ్. కళ్ళే మూసుకుపోతే కర్తవ్యం ఇంకేం జ్ఞాపకం ఉంటుంది?...క్షమించండి. మీ ఆజ్ఞ

అయినప్పుడే తిరిగి వస్తా”నంటూ మేడ మెట్లు దిగబోతూంది అంతలో ఆమె చేయి పట్టుకొని “మాధవీ! నాగది, నీగది అని భేదం ఏముంది? రా...రా మాధవీ! నా ఆజ్ఞ లేకుండా నిన్నెందుకు రావద్దన్నానో తెలుసునా? ఇటువంటి దృశ్యాలు నీకంట బడ నీయకుండా ఉందామని. అంతే...రా...రా...కూర్చో.” అంటూ తన ప్రక్కనే సోఫాలో కూర్చోబెట్టాడు. మాధవి కన్నులవంక చూచాడు. ఆమె చాలాసేపు కన్నీరు కార్చి ఉంటుందని గ్రహించాడు.

“మాధవీ! కళ్ళిలా పొంగిపోయాయే.”

“కొన్ని వేడి కన్నీళ్ళు కనురెప్పలనుండి జారిపోయాయి కదూ! అంచేత.”

“కన్నీళ్ళు కారడంచేత కనురెప్పలుబ్బాయి అని తెలియక కాదు, ఆ కన్నీళ్ళు కార్చడానికి కారణం ఏమిటని నా ప్రశ్న.”

“అదా? ఏముంది? హృదయానికి హృదయంగా జీవితానికి జీవితంగా భావించే భార్య దగ్గరే భర్త రహస్యంగా ప్రవర్తిస్తుంటే, భార్య బ్రతుకు కన్నీటికాలువ కాక ఏముంటుంది?”

“రహస్యజీవనమా?”

“కాదా మరి?”

“ఎలా?”

“ఆ బ్రాందీ గ్లాసులో పోయమంటే ఆనందంతో నేను పోయను.”

“పోయ వనేగా?”

“ఎందుకు పోయను?”

"తప్పని."

"ఆ తప్పుడు పని ఎందుకు చెయ్యాలి?"

"నీకు తప్పైన పనులు నాకు కాపోవచ్చును గా మాధవీ!"

అదెలా పండిట్ జీ! ధర్మం లోకానికంతా ఒకటి కాదా?"

"ఎన్నటికీ కాదు."

"అదెలా?"

"మద్య మాంసాలు మనకు తప్పు; పాశ్చాత్యులకు ఒప్పు కదా! విడాకులు వారికి ఒప్పు; అది మనకు తప్పు కదా! అంతవర కెందుకూ— మన దేశంలో సంతానం కోసం పరపురుషుల వద్దకు భార్యను పంపడం నాడు ధర్మం; నేడధర్మం కదా! ఒక స్త్రీ అయిదుగుర్ని వివాహం చేసుకోవడం, ఒక పురుషుడు నూర్గురు భార్యలను చేసుకోవడం నాడు ధర్మం; నేడధర్మం కదా! నేటి ఏకపత్నీవ్రతం; ఏకసతీవ్రతం ఒకనాడు అసలు అమలులో లేవు కదా!......మాధవీ! నేటి అహింసాతత్వం ఆనాడు భావింపబడనైనా భావింపబడలేదు కదా!...ఏమంటావ్ ఈ ధర్మాధర్మాల వైపరీత్యానికి?"

"కాలాన్ని బట్టి సంఘం, సంఘాన్ని బట్టి ధర్మం మారుతుందని ఒప్పుకుంటాను. ఆ నాటి ధర్మం ఈ నాటికి అధర్మం కావచ్చు. కాని ఈ నాటి ధర్మం లోకం అంతటకూ ఒకటే కదా?"

"ఎలా గౌతుంది? అహింసా తత్వం మన ధర్మం. శత్రువులను చీల్చి చెండాడడం పాశ్చాత్యుల ధర్మం."

"అయితే మీ ధర్మం ఏమిటి?"

"ఆత్మప్రబోధానుసారం ఆచరించడం నా ధర్మం."

"మద్యమాంసాలు తప్పు లేవని మీ ఆత్మ ప్రబోధిస్తుందా?"

"తప్పక. మద్యం, మాంసం, తప్పైతే ప్రపంచంలో మూడువంతుల మనుష్యులకి మంది ఎందుకు తాగుతున్నారు? ఎందుకు తింటున్నారు? వారంతా దుష్టులే."

"బాగు బాగు. అయితే వ్యభిచారం కూడా దోషం కాదా?"

"మాధవీ! వ్యభిచారం అనే పదానికి అర్థం నీకు కాదు; పెక్కురకు తెలీదు. వ్యభిచారం అంటే మన మనసు ఒక చోటనుంచి మరొకచోటుకు బాగుగా సంచరించడమే వ్యభిచరించడం. అది రానురాను పురుషుడొక స్త్రీనిదాటి మరొక స్త్రీని అనుభవించినపుడు, స్త్రీ ఒక పురుషుని దాటి మరొక పురుషుని అనుభవించినపుడు, వారిని వ్యభిచారులంటుంది నేటి సంఘం. నిజానికి మనం ఒక్కసారి సింహావలోకం చేస్తే ఈ వ్యభిచారం ఎంతమాత్రం అధర్మం కాదని తెలుస్తుంది.

మాధవీ! మానవులు పదిమందీ కలిసి సంఘం అయిన తొలికాలంలో, అసలు వివాహాలు లేవు. ఒక స్త్రీ యావజ్జీవితం ఒక పురుషునితోటే ఉండాలని కాని నియమం లేదు. ఒక స్త్రీ పెక్కుమందితో ఉండేది; ఒక పురుషుడు పెక్కుమంది స్త్రీలను రంజింపజేసేవాడు. ఆనాటికి కావలసింది సంతానోత్పత్తి కాని మరొకటికాదు. అప్పుడు 'వ్యభిచారం' అనే పదం కేవలం నిరర్థకమే.

తరువాత భారతకాలం తీసికుందాం. భగవద్గీతవంటి మహోన్నత వేదాంతగ్రంథాన్ని ఉపదేశించింది, లోకప్రఖ్యాతి

వహించిన మహాజ్ఞాని, భగవత్ స్వరూపు డయిన కృష్ణ భగవానుడు ఎనమండుగురు స్త్రీలతో ఉన్నాడు. 16 వేల గోపికా స్త్రీలు అబద్ధం; కాని ఎనమండుగురు నిజంకదా! అలానే ధర్మరాజు మొదలైన పాండవులంతా ద్రౌపదితోనే కాక మరి కొందరు స్త్రీలతో ఉన్నారుకదా! అలానే కుంతీ, ద్రౌపది మొదలైన స్త్రీలు ఒక పురుషునితో కాక అయిదుగురు పురుషులతో ఉన్నారుకదా! నేటి పద్ధతి ప్రకారం వారంతా వ్యభిచారులే కదా! వ్యభిచారమహాదోషంచే పతితులేకదా!

పోనీ వారికి ఏకపత్నీవ్రతంలోని పరమార్థం తెలీదంటే, వారికంటే రాముడు పూర్వుడుకదా! రాముడు ఏకపత్నీ వ్రతం సద్వ్రతం అని రుజువు చేయలేదూ? అదే ప్రజాక్షేమకరం అయితే కృష్ణుడెందుకు ఆచరించలేదు?

ఏమంటావ్ మాధవీ? పాశ్చాత్య దేశాలన్నిటిలోనూ విడాకులుండే. భర్తను విడిచి ఆభార్య మరొకరితో ఉండొచ్చునే. సంఘం హర్షిస్తుందే. అదిమాత్రం వ్యభిచారంకాదా?

సృష్టి ఆదినుంచి నేటివరకూ లక్షకి ఒక్కడు కూడా పాటిస్తున్నారంటావా ఈ నియమం?"

"వాదనకు కాదుగాని పండిట్ జీ ఒక్కమాట...... ప్రపంచం 'ప్రోగ్రెస్' అవుతుందంటారా? కాదా?"

"అవుతుంది."

"ఒకానొకనాడు బట్టలు తయారు చేయడం తెలియని రోజుల్లో మానవులు నగ్నశరీరులై ఉన్నారే, నేడలాఉంటున్నారా? జ్ఞానోదయం అయినకొలదీ సంఘంలో పద్ధతులు మారడంలేదూ?"

"మారుతున్నాయ్. అయితే—"

"ఆనాడు కేవలం పచ్చిమాంసం తినేవారు..."

"నేడు వండిన మాంసం తింటున్నారు. మానవులలో అభివృద్ధి ఉంది; ఉంటుంది—అయితే—'

"అలానే మానవుడు అభివృద్ధి పొందగా పొందగా అతని పరిపూర్ణస్వరూపం (Perfect Stage) మన గాంధీమహాత్ముడనుటకు సంశయమా?... అయినప్పుడు ఆయన మద్యమాంసాలు, బహుపత్నీవ్రతం, బహుసతీవ్రతం, విడాకులు తప్పని, అవిమానవ పురోభివృద్ధిని ఆపుచేసే కాముక కృత్యాలని ఖండించలేదా? సాత్వికాహారం, బ్రహ్మచర్యం, ఏకపత్నీవ్రతం, పాతివ్రత్యం మంచివని చెప్పలేదా? అలా ఆయన ఆత్మప్రబోధులై చెప్పలేదంటారా? ఆయన మంచివని చెప్పినవన్నీ మీరు చెడ్డవని రుజువు చెయ్యాలని ప్రయత్నించడంలో వారికంటే మీరు మహాత్ములని రుజువు చెయ్యడమా!

పండిట్ జీ! మహాత్ముని శిష్యులని చెప్పకుంటూ, మహాత్ముని ఆశయాలు నెలకొల్పడానికి ప్రయత్నిస్తూ వారిఆశయాలకు వ్యతిరేకంగా నడుస్తున్నారంటే మిమ్ములను దేశభక్తులనాలా? కపట దేశభక్తులనాలా? మనసు, మాట, చేత ఒక్క దరువులో నడవకపోతే ప్రయోజనం ఏముందండీ?

మహాత్ముని ఆశయాలు బోధిస్తూ, వానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం ధర్మం అంటారా ?"

"చెప్పాను కదూ, ధర్మాధర్మాలు అంత తేలిగ్గా తేలేవి కావని, ఎవరూ ఒక గిరి గీసి ఇవన్నీ ధర్మాలు, మిగిలినవన్నీ అధర్మాలని చెప్పలేరుగా."

"పోనీ ఒకరిని నిష్కారణంగా హత్యచేయడం కూడా ధర్మమా?"

"నిష్కారణంగా ఎవరూ ఎవరినీ హత్యచేయరు. హత్యే కాదు— కారణం వినా కార్యంలేదు. ఇక హత్య చేయడం ధర్మమా, అధర్మమా అంటావ్? స్వార్థం కొరకు హత్యచేస్తే అధర్మం; మహాపాపం. స్వార్థ రహితంగా, దేశాభ్యుదయం కొరకు చేస్తే ధర్మం. నిజానికి పిరికితనం లేకుండామనమంతా దేశం కొరకు బలికావాలి. స్వతంత్ర పోరాటంలో ప్రాణాలు బలిచేయటం కంటే పరమార్థం లేదు. ధర్మాలకన్నిటికీ మించిన ధర్మం దేశసేవ. దేశం గురించేగా కోటానుకోట్ల ప్రజలుమరణించేది."

"మరణించడం వేరు; హత్యచేయడం వేరుకదూ!"

"కావచ్చు. శత్రువులను వధించడం,హత్య చేయకుండా ఎలా? వధ; హత్య—రెండూ ఒకటేనా?"

"మన మనో భావాలను బట్టి పదాల అర్థాలు తీసి కుంటాం లెండి."

"మాధవీ! మానవులు ఎవరి హృదయ పరివర్తనాన్ని బట్టి లోకం విషయాలు అర్థంచేసికుంటారు. మనరూపం నిలువుటద్దంలో చూస్తే నిలువు నిలువల్లా కనిపిస్తుంది. కాని మన వెనుక భాగం మనకు కనుపించదు. వెనుక భాగం కనిపించాలంటే వెనుక ఒకఅద్దం ఉంచాలి. అపుడు ఎదుటి భాగం, వెనుక భాగం కనుపిస్తాయ్ కాని ప్రక్కలు కనుపించవ్. ప్రక్కలు కనుపించాలంటే ప్రక్కలకూడా అలా అద్దాలు పెట్టాలి. అపుడు మానవుడు పరిపూర్తిగా కనిపిస్తున్నట్లుం

టాడు కాని పాదాల క్రిందభాగం, తలపైభాగం కనిపించవు. అవి ఎన్ని అద్దాలు పెట్టినా కనిపించవు...... ఆలోటు లోటే అలా పెద్దద్దంలో చూస్తే పెద్దగా కనుపించిన ఈ రూపం చిన్నద్దాల్లో చిన్నదిగా కొంతభాగమే కనిపిస్తుంది. తెలిసిందా మాధవీ! అలాగే ఈసృష్టి ఒక అద్దం అనుకో. దానిపై ఎంత విశాల భావం ఉంటే, దానిలో నీహృదయం అంత విస్తారంగా కనబడుతుంది.

మాధవీ! ఒక పెద్ద గోపురం ఎక్కాలనుకో, పైమెట్టు మీాద ఒకరు, మధ్య మెట్టుమీాద ఒకరు, ఆఖరు మెట్టుమీాద ఒకరు ఉంటారనుకో ముగ్గురు చూపులూ ఒకవస్తువుని ఒకే విధంగా చూడలేవ్. పైమెట్టు మీాద వారికి ఎంచుమించుగా మేడలూ పాకలూ ఒక్కలా కనుపిస్తాయ్ మధ్యమెట్టువారికి కొంతభేదం కనుపిస్తాయ్. ఆఖరు మెట్టు మీాద ఉన్న వారికి అన్నీ భేదంగానే కనుపిస్తాయ్. తెలిసిందా? అలాగే మహాత్ము లకు లోకం అంతా ఒకటిగా కనుపిస్తుంది; భేదబుద్ధి వారికి ఉండదు. వారుద్వంద్వాతీతులు. వారిది పరిణత బుద్ధి. విశాల భావం ప్రేమజీవనం...మధ్యతరగతి వారికి కొన్ని భేదాలు కనపిస్తాయ్ మూడవ తరగతి మూర్ఖులకు అన్నీ భేదాలే.

మాధవీ! ప్రపంచపరిణామం అంతా అర్థం అయినట్లే ఉంటుంది; నిజానికి ఏమీ అర్థంకాదు. బ్రతికిఉన్నా కాస్త జీవితకాలం వింత వింత అనుమానాలతో వ్యధచెందే దాని కంటే, వీలైనంత ఆనందం అనుభవిద్దాం క్షణకాలం కూడా వృధపుచ్చకుండా ఆనందం అనుభవిద్దాం. ఏం? లే...ఇలారా!

మాధవీ! నా రహస్య జీవనంగురించి నీకెందుకు? నీ ఆనందాన్ని నేనేమైనా అరికట్టానా? నీకు ఆనందం ఈయకుండా ఉన్నానా? మనఇద్దరం కలసిఉన్న ప్రతిక్షణంలోనూ ఒక తేజోరేఖ వెలిగిపోవాలి; ఒక ఆనంద తరంగిణి రాగం తీయాలి; ఒక ఆశాచంద్రిక వికసించాలి; తెలిసిందా? మన హృదయాలపై జారినచీకటి తెరను చించివేయాలి. అదే ఆనంద మధురజీవిత నృత్యం...లే...రా...నవ్వుతూరా... హృదయాన్ని నాట్యం చేయిస్తూ రా...మాధవీ...రా... అలా అరమోడ్పు కన్నులతో ఆనందాన్ని నలగకొట్టకు... జరిగిపోయిన కాలం మళ్ళీరాదు. లే మాధవీ! ఆనందంగురించి పుట్టాం. ఆనందం అనుభవించాలి..." అంటూ ఆమెచేతులు పట్టుకొని తనదగ్గరకు తీసికొన్నాడు. ముళ్ళచెట్టు నల్లుకొన్న మల్లెతీవలాగ అతని గాఢ పరిష్వంగంలో ఆమె వివశురాలైపోయింది. పొదలో అల్లిబిల్లిగా అల్లుకొన్న మాలతీ లతను తొండంతో తెంచి పైకెత్తిన మదపుటేనుగులా, అతడామెను మంచంపై కూర్చొపెట్టాడు.

ఇరువురి హృదయాలు దగ్గరకుజేరాయ్. కాని రెండు హృదయాలలోని భావాలూ వేర్వేరు..."ఇదే జీవితం! ఇదే ఆనందం!" అనుకుంటున్నాడు పండిట్ జీ "ఇది జీవితమా? ఇది ఆనందమా?" అనుకుంటుంది మాధవి ఏది జీవితమో, ఏది ఆనందమో పాఠకులే నిర్ణయించండి!!

# V

రెండు నెలలు గడిచాయ్.

పండిట్ జీ తన అంతరంగిక కార్యాలు ఆలోచించడానికి ఒక పెద్ద భవనం తీసుకున్నాడు. ఆ భవనంలో అతని గది చాలా దూరాన్నుంటుంది. అక్కడెటువంటి హత్యలు జరిగినా తెలియనంత రహస్యంగా ఉంటుంది.

అతనికొక కారు, ఇద్దరు నవుకర్లు. వందమంది వాలంటీర్లు. స్వాములవారికంటే గౌరవం చెలాయిస్తూ ఉన్నాడు.

♦ ♦ ♦ ♦ ♦

కారు దిగింది లక్ష్మి. త్వర త్వరగా లోపలకు చనువు చేత వెళ్ళబోతూంది. కాని గుమ్మం ముందు నమ్మినబంటు గోవింద్ ఆపుచేశాడు.

"ఏం గోవింద్! ఎవరున్నారు?"

"ఒక వ్యక్తి."

"స్త్రీవ్యక్తా? పురుషవ్యక్తా?"

"ఏవ్యక్తో చెప్పమని అయ్యగారి ఆజ్ఞ కాలేదు."

"ఏమని ఆజ్ఞ అయింది?"

"లోపలవ్యక్తి ఆ ద్వారంగుండా బయటకు వెళ్ళినతరువాత, ఆయన 'కాలింగ్ బెల్' వాయించేవరకు నేనుకాదు, బ్రహ్మరుద్రుడైనా వెళ్ళకూడదని ఆజ్ఞ. అంతవరకూ తమరీ గదిలో కూర్చోండి. స్త్రీలకీ గది; పురుషులకా గది అని తమకు తెలిసిందేగా?"

ఆమెముఖం చిన్నబుచ్చుకొని కూర్చుంది.

♦ ♦ ♦ ♦ ♦

కొంతసేపటికి బెల్ వినబడింది.

గోవింద్ వెళ్ళి లక్ష్మి వచ్చినసంగతి చెప్పాడు.

ఆయన ఆజ్ఞ కాగా ఆమెను లోపలకు పంపాడు.

♦ ♦ ♦ ♦ ♦

"ఏం లక్ష్మీ! ఏమిటి విశేషాలు?"

"ఏముంది పండిట్‌జీ! దేశం అంతా గగ్గోలుగా ఉంది."

"ఎందుకు?"

"నీవేదో పదిలక్షలకుపైగా 'ప్రజారక్షణనిధి' వసూలు చేశావని, అది ప్రజల కుపయోగించకుండా గుటకాస్వాహా చేస్తావని అంటున్నారు."

"అంతేగా. లోకులు కాకు లని తెలీదు? నిజం నిలకడ మీద తెలుస్తుందిగా...అంతేనా...ఇంకా ఏమైనా క్రొత్త సంగతులు..."

"లేకే మిటోయ్..."

ఆమె అతని మెడకు తనరెండుచేతులు పాము చుట్టు కున్నట్లు చుట్టుకుంది—అతని రసికత కనపర్చకుండా ఉంటాడా?

కొంతసేపయింది...

"చెప్పవోయ్! లక్ష్మీ!"

"ఏం చెప్ప నామె గురించి?"

"చెబుదూ?"

"అందాలకు రంభ; అభిమానానికి అరుంధతి; అనురాగానికి అహల్య; ఆశయాలకు జానకి...

"శభాష్"

ఆమె వీపుచరిచి "ఇంకాతీసుకు రాలేదే?" అన్నాడు.

"మూలా తేలిక సరుకు కాదు."

"అన్ని పడవలూ ముందు బరువుగానే ఉంటాయ్; సరుకు దింపాక తేలికైపోతాయ్......ఒక్కసారి దృష్టి ఇటు పార నియ్. అంతేచాలు. చూపుకు గొలుసులు వేసి దిక్కుల చివర్లకైనా కొట్టుకు పోనూ?"

"డబ్బు లేదు సుమా?"

"ఆఁ వెధవడబ్బు పోనిద్దూ......మనకున్నాది చాల దూ?లక్ష్మీ! నిజం చెబుతావిను...దేశభక్తి పేరుపెట్టి కావా లంటే లక్షల కొద్దీ డబ్బు సంపాదించ వచ్చు...పది లక్షలు ఖర్చు పెట్టి అఖండవి ఖ్యాతి ఆర్జింపవచ్చు......కాని సంధ్యా సౌందర్యం అంతా కన్నులలో వెలగే మనోజ్ఞమూర్తి; వికసించీ వికసించని నవమల్లికలా స్వచ్ఛంద ప్రణయామృతాన్ని హృదయ పాత్రలో దాచు కొన్న ప్రేమమూర్తి; కళామయి ఎప్పుడైనా కనబడుతుందా అని వెఱ్ఱిగా వెదికే నాహృదయం ఎంత వెక్కి వెక్కి ఏడుస్తుందో నాకు తెలీదు."

"నిజం."

"అబద్ధం నీతో ఆడాలా లక్ష్మీ! ధనాశ పోయింది. యశోభిలాష నశించింది. నాకే కోరికా లేదు. నాకున్న కోరి కల్లా ఒక్కటే—సౌందర్యా రాధన. ఒక్క త్రిజగతీ సౌందర్య మూర్తి హృదయ దేవాలయంలో, హారతిలా వెలిగి ఆరిపో దామని ఉంది. అదేనా తుది కోరిక. తీర్చగలవా లక్ష్మీ!"

"అదో కష్టమా...కాని..."

"చెప్పు."

"ఆమె నిర్మలమైన దేశభక్తురాలు. పరుల కన్నెత్తి చూడని ఆత్మాభిమాని. తనెత్తు బంగారాన్ని ధార పోసినా మనసు కరుగని మంగళమూర్తి. ధనాశ లేదు, కీర్తి కాంక్ష లేదు. కేవలం సత్కార్యాభిలాష తప్ప మరొకటిలేదు. అటువంటి సచ్ఛీల......"

అతడు చిలక నవ్వు నవ్వడం ప్రారంభించాడు,

"లక్ష్మీ! ఆడవారి హృదయాలను అర్థంచేసి కోలేనంత అమాయకుడు కాడు నీ పండిట్ జీ. వెళ్ళు. రప్పించు.అంతే... ఆ పైవిషయాలు నేను చూసుకుంటాగా... ఇదిగో ఈ వేయి రూపాయలూ."

"సరే...జాగ్రత."

తిరిగి. ఇద్దరూ తమశరీరాలను కాముకాగ్నిలో వేల్చేశారు. ఆమె వెళ్ళిపోయింది. వేయిరూపాయిలు తీసికొని,...

తిరిగి బెల్లు మోగింది

* * * * *

టక్కూ టిక్కూ లాడుతూ వగలమారి వంకాయి, ముదిరిపోని బెండకాయి, లేతసొరకాయి, గుమ్మడికాయలా తిప్పుకుంటూ తయారయ్యింది ఆ అమ్మన్న—రతనాల బొమ్మలా, బంగారుబిణెలా, కిరమణాల డబ్బాలా, అమృతాంజనం సీసాలా...టింగు రంగా అని తయారైన ఆరంగుల బొమ్మకు చోటిచ్చాడు గోవింద్...

ఇంక చెప్పనా? నవ్వులే నవ్వులు. పువ్వులే పువ్వులు... చెక చెకలు. పకపకలు. వికవికలు. బెకబెకలు......ఒకటే

సొద. రొద. వద. చెక.....ఎంతసేపు గడిచిందో!!......
తిరిగి బెల్ చప్పుడు......

* * * * *

తరువాత ప్రవేశం సామ్రాజ్యం.

ఈమె షోక కొత్తగిత్త. ఏసంతలో పట్టాడో తెలీదు. విడోముఖం. పునిస్త్రీభావాలు. ఖద్దరుబట్టలు. శెస్టిస్ భావాలు నానాజాతి సమితి లాగుంది ఆమెగారి అత్యద్భుత వాలకం... రోతజీవితం...

ఆ తావిలేని పూవును చూచాడు.

"హలో సామ్రాజ్యం...నీవా ... రా...నీకొరకు మొన్నటనుంచీ ఎదురుత్రోవలు చూస్తున్నా."

"అలాగా?ఆ సంగతి తెలుస్తే ఎప్పుడో వాలిపోదునే."

"ఇప్పుడైతే ఏం గాని, వాలంటీరుగా జేరావా?"

"జేరడం-వీధి వీధు లా పండిట్ జీకి జై కొట్టడం..."

"చాలా చేస్తున్నా వన్నమాట?"

"ఆఁ"

ఆమె ప్రక్కగదుల్లో ఎవరో కొందరాడవాళ్ళున్నట్లు నవ్వులు విన్నది. ఆశ్చర్య పోయింది.

"పండిట్ జీ...ఇటూ అటూ చాలామంది..."

"ఆఁ అయితే...వాలంటరీగా జేరావ్...సరే... ఇకనీవు వెళ్ళు...ఖర్చుకు ఇదిగో..."

ఆమె డబ్బు తీసికొంది.

"వీ రంతా ఎవరూ అని..."

"ఆలోజిస్తున్నావా? ఆలోజించు...ఆలోచన తట్ట పోతే చెబుతాలే..."

ఆమెను సాగనంపా డలాగే...పాలీయుని గొడ్డును చూస్తే ఎవరికి గౌరవం ఉంటుందిలెండి.

మళ్ళీ బెల్లు మ్రోత.

♦ ♦ ♦ ♦ ♦

ఈ పర్యాయం శారద నిప్పులు కక్కుతూ, తోక తొక్కిన నల్ల త్రాచులా, నెత్తురుమిసే రుద్రమూర్తిలా ప్రవేశించింది.

లోపలకు వెళ్ళింది. గుండె బద్దలయిందేమో కోటి పడగల ఆదిశేషునిలా కసరి బుసకొడుతూ తన ఎదుట నిల బడ్డ శారదను చూచాడు. నిర్ఘాంతపోయాడు. 'కూర్చో' మని చేసన్నల చూపించాడు.

"పండిట్! ఈ మాయా నాటకంలో నీకపటవేషం ఎన్నాళ్ళు? ఎన్నాళ్ళకు నీపాపం పండడం?ఎప్పుడు జీవితనాట కానికి చివర తెరజారడం."

"శారదా! ......జాగ్రత."

"పీనుగులను బెదిరించే నీ కేక ప్రాణులను బెదిరించలే దోయ్ పిచ్చివాడ.నీ రహశ్యమలినకుచ్ఛిత దుష్టజీవితం లోకా నికి తెలియ లేదనుకోక. లోకం కాకై కూస్తుంది,"

"పటప్"

"బల్ల చప్పుళ్ళకు కుందేలుని కాదు బెదరడానికి..."

అతడు రివాల్వర్ తీశాడు. ఆమెకేసి గురిచూశాడు.

"పండిట్! ప్రాణానికి భయపడే పిరికి పందకాదీ శారద. నన్ను చంపు. సంతోషిస్తా. అసలువచ్చిందే నీచేతిలో చావాలని. నా హత్యచే నీకు ఉరిశిక్ష విధింపచేయాలని...నన్ను చంపిన నీ చావు తప్పదు కదా! దానితోనైనా మిగిలిన స్త్రీలోకం బాగుపడుతుంది..."

అతడు నిర్ఘాంతపోయాడు.

"పండిట్! చంపు. ఆ తలుపు తీసి చూడు. పోలీసు సిబ్బందీతో వచ్చానని మరువక. జాగ్రత. నీ ప్రాణాలు నా చేతిలో ఉన్నాయ్...పండిట్! నీ ఇనుపచేతుల్లో ఎన్ని పూల హృదయాలు చిదిమివేశావో తెలుసా ? ఎన్ని పూలను నలిపివేశావ్ ? ఎన్ని పూలు కన్నీళ్ళు రాల్చాయ్ ? ఎన్ని పూలు నెత్తురు కక్కుకొని చచ్చాయ్? జ్ఞాపకం తెచ్చుకో— 'దేశసేవ' అని ఎన్ని కొంపలు కూల్చావో జ్ఞాపకం తెచ్చుకో— ఇకనుంచి అయినా ఈ దేశద్రోహం మానతానని ప్రమాణం చెయ్. నిన్ను విడిచి నీ ప్రాణాలు రక్షిస్తా...లేకపోతే... చూచావుగా పోలీసు దళం..."

అతడు తల వంచుకున్నాడు.

"పండిట్! మాటాడవే."

"శారదా! నన్ను రక్షించాలి. నీవు చెప్పినట్లేచేస్తా."

"మంచిది. నీ మాట తప్పావా...జాగ్రత. చావు తప్పదు."

ఆమె గర్జిస్తూ బయటకు వెళ్ళింది. పోలీసు ఇన్స్పెక్టరుతో ఏమి చెప్పిందో తెలీదు కాని, వాళ్ళంతా వెళ్ళిపోయారు.

"దీనికంటే ఏ కల్లుపాకైనా, ఏ సారా దుకాణమైనా మేలే. పడుపు వృత్తిచే బ్రతికే ఏ సానికొంపైనా మేలే. ఛీ. ఛీ. వీళ్ళు దేశభక్తులా? దేశద్రోహులా? అనుకుంటూ కాపలా కాస్తున్నాడు గోవింద్.

♦ ♦ ♦ ♦ ♦

## VI

అనూరాధ అందానికి ఆకరం. అనురాగానికి నిలయం. ఆనందానికి మకుటం. మహాత్ముల సూత్రాలకు లక్ష్యం. ప్రజలకు ప్రాణం. దేశభక్తికి మూలం. అటువంటి అనూరాధను పండిట్ జీ ప్రేతగృహం లోకి తీసుకు వచ్చింది. లక్ష్మి.

ప్రథమ పరిచయం, బహుపరిచయాల క్రింద మారింది. ఇప్పుడు పండిట్ జీ అంటే ఆమెకు ప్రాణం. అనూరాధ అంటే అతనికి జీవం.

కాలం గడుస్తూంది. నెల్లాళ్ళయ్యాయ్- ఆమె ఇప్పుడెంచుమించుగా ఆతని ఆంతరంగిక కార్యదర్శిని అని చెప్పొచ్చు. ఆమె చేతికి నాలుగు లక్షల రూపాయి లిచ్చి హరిజనులకు విద్యాసంస్థ లేర్పరుప జేయించాడు మరో నాలుగు లక్షల రూపాయి లిచ్చి 'విడో హోమ్' నెలకొల్ప జేశాడు... ఆమె అడిగిందల్లా ఇస్తున్నాడు. అడక్క పోయినా ఇస్తున్నాడు.

ఇప్పుడెక్కడ చూచినా ఆమె పేరుప్రఖ్యాతులే ఆమెను 'అభినవ భారతి' అన్నారు. 'త్యాగమూర్తి' అన్నారు. 'దేశోద్ధారిణి' అన్నారు. ఎన్నో అన్నారు.

ఆ పేరు ప్రఖ్యాతులు ఆమెకు ఆనందం కలిగించక పోలేదు. అంత విఖ్యాతికి కారకుడైన పండిట్‌జీ మీద అభిమానం కలిగించకా పోలేదు. ఇద్దరూ సినిమాలకు వెళ్తున్నారు; మీటింగులకు వెళుతున్నారు; ఉపన్యాసా లిస్తున్నారు... ప్రజల కామెపై అనుమానం కలక్కపోలేదు. ఎలాగైతే కాలం తన గాలిరెక్కల పైన వారిద్దరినీ మరో ఆనంద ప్రపంచానికి మోసుకు పోతూ, మోసుకు పోతూ ఉంది.

* * * *

పుష్పం వికసించాలే గాని సువాసన ఎవరు దాచగలరు? శవం కుళ్ళాలే గాని దుర్వాసన ఎవరు దాచగలరు? మంచి చెడ్డలు పరిపక్వ దశ పొందాలే కాని ఏ హృదయం దాచగలరు?

* * * *

ఆ రోజు అమావాశ్య.

సాయంకాలం ఆరు గంటలు దాటింది. అనూరాధ తలారా స్నానం చేసి, కొత్త ఖద్దరు కోక కట్టుకొని, పసుపు రాసుకొని, కుంకుమబొట్టు పెట్టుకొని, భారతమాతలా అతని దగ్గరకు వెళ్ళింది. ఆనాటి ఆ పవిత్రమూర్తిని చూస్తున్న ప్రతివానికి చేయెత్తి నమస్కరించాలని ఉన్నట్లుంది. సాక్షాత్తు భారత మాతలా ఉండంటే అతిశయోక్తి కాదు.

* * * *

అప్పటివరకూ తన కామోద్రేకాన్ని అరికట్టగలిగిన పండిట్ ఆ రోజు తన హృదయానికి సంకెళ్ళు తీసివేశాడు.

భావాలను పరుగులెత్తించాడు. అతడా దివ్యమోహన సౌందర్యమూర్తిని చూస్తూంటే ఉద్రిక్తుడయ్యాడు; ఉన్మాదుడయ్యాడు; ఉప్పొంగిపోయాడు.

ఆ మాటా ఈమాటా చెప్పి ఆమెను గాఢంగా కౌగిలించుకున్నాడు. ఆమె అతని బిగికౌగిలిలో ఉక్కిరిబిక్కిరై పోయింది. అతని కౌగిలి విడిపించుకోడానికి ఎంతో పెనగులాడింది. అతని చేతులు ఆవల తోసి గంభీరమూర్తిలా నిలబడింది.

"పండిట్ జీ! ఈనాడు అమావాశ్య. సర్వం కళ్ళకు పొరలు కమ్మినట్లున్నాయ్. ఎదటివారిని పోల్చుకోలేకుండా ఉంది...పండిట్! నీ రహస్య మలినజీవితం శారద నాకు చెప్పలేదనుకోకు. నీవు దేశద్రోహివని తెలియక నీతో స్నేహం చేయలేదు. తెలుసును నీవు మహాపాపివని. మోహాంధుడవగు నీవు నాచేతనో, పవిత్రశీలనగు నేను నీచేతనో మరణించుట కూడ తథ్యమని తెలుసు...తెలిసే సర్పం నోటిలో తలదూర్చాను. సర్పాన్ని పూలహారంగా మెడలో వేసుకున్నాను...పండిట్! నీతో స్నేహంచేసిన నా ఆశయం నెరవేరింది. ప్రజల సొమ్ము అపహరించి పరస్త్రీలకు, బ్రాందీ సీసాలకు, దుష్టస్నేహాలకు గుమ్మరించనున్న నీబుద్ధి తెలిసికొనే నీతో స్నేహంచేసి నీవు 'ప్రజారక్షణ నిధికై' ప్రోగుచేసిన దానిలో పదిలక్షలు ప్రజల నిమిత్తం ఖర్చుపెట్టించా. చాలు. ఇంక నా జీవితచరిత్ర ముగిసినా విచారించను... పండిట్...సెలవు...అవసరంవస్తే నా దేశంకొరకు నాప్రాణాలైనా బలిచేస్తా కాని, నా సౌశీల్యాన్ని బలిచేయలేను.

నాలో ఇంకా ప్రాచీన హైందవ రుధిరం చల్లారి కరుడు కట్ట లేదుసుమా!...పండిట్. నేటినుంచీ నీకూ నాకూ సరి వెళు తున్నా. ఇంటికో—స్వర్గానికో...ఎక్కడున్నా నీ దురంతా లపై నీవువేసిన 'దేశభక్తి' అనే ముసుగుతీసి నీ మలిన జీవి తాన్ని లోకానికి చూపిస్తా—జాగ్రత..."

ఆమె వెనక్కి తిరగబోయింది. అంతే—గుండెల్లోంచి గుండు దొచ్చుకుపోయింది — అచ్చటే. నెత్తుటి జల్లు— వసుపు బొట్టు—కుంకుమ రేఖ — జీవనజ్యోతి—అచ్చటే— అచ్చటే అన్నీ భావిభారత భాగ్యజీవన శాంతికై కన్ను మూశాయ్...

అతడా పవిత్ర మూర్తిని చూచాడు.

కన్నులు చెదిరిపోయాయ్,

ఏ పవిత్ర మూర్తికై పరితపించాడో, ఆ పవిత్రమూర్తి ఇప్పుడు నెత్తుటి బురదలో నిదురపోతూ ఉంది. అతడు వెఱ్ఱిగా 'గోవింద్' అని కేక వేశాడు.

గోవింద్ లోపలకు వెళ్ళి చూచాడు. ఒక్కసారి అతని హృదయం బద్ధలై పోయింది.

"పండిట్‌జీ!"

"గోవింద్...భయపడకు. ఈ దొడ్డి గుమ్మం నుంచి వెళ్ళి వీధి గుమ్మం తాళం వేసిరా...చెబుతా"

అత డలాగే చేశాడు.

బయట కాపలా. లోపల హత్య వెలుపలకు తెలియ లేదు. అంతా లోపలే శవాన్ని పెట్టెలో పెట్టి కూర్చున్నారు.

వారి గుండెల చప్పుడు తప్ప ఇంకే శబ్దం వినిపించడం లేదు.

◆ ◆ ◆ ◆

అది మహాసముద్రం.

ప్రతి కెరటం మాటునా ఒక ప్రాణి సమాధి ఉంటుంది. ప్రపంచంలో పాపం భరించలేక ఏడుస్తుందో అన్నట్లు ఘోషిస్తూంది –

రాత్రి రెండు గంటలు దాటింది.

శవాన్ని పెట్టిలో పెట్టుకొని, ఆ పెట్టి తలమీద పెట్టుకొని సముద్రం వైపు వెళ్ళిపోతున్నాడు గోవింద్. అతడ్ని చూచి, అనుమానించి, ఒంటరివాడవడంచే భయపడి, తన విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చాలని ఒక పోలీసు అతడ్ని వెన్నాడుతూనే ఉన్నాడు.

ఆ పోలీసును వెన్నాడుతున్నారు గోవింద్‌ను కనిపెడుతూ వస్తున్న పండిట్‌జీ పటాలం.

◆ ◆ ◆ ◆

"తల్లీ! భారతదేశాన్ని ఉద్ధరించడానికి అవతరించిన మహాపవిత్రమూర్తివి. పేదల పాలిట కల్పవృక్షానివి. నీ దేశం కోసం ప్రాణాలు బలిచేసిన పుణ్యమూర్తివి... తల్లీ! మానవ సేవ చేయడానికి నీలోని శక్తి నాకు కొంత ప్రసాదించు. నేను నీ బిడ్డను. నీవు నా తల్లివి... నిన్ను నా చేతులతో మహాసముద్ర సమాధి చేస్తున్నా ... నీలా సత్యం గురించి ప్రాణాలు అర్పించే శక్తి నాకూ ప్రసాదించు తల్లీ!" అని కన్నీళ్ళు ఆ మున్నీటిలో కలిపి ఆ పెట్టిని ఆ సముద్రంలో

విడిచి, ఆమె ఆత్మశాంతికై భగవంతునకు నమస్కరించి, బయలుదేరాడు మన నమ్మిన బంటు గోవింద్.

పది అడుగులు వేశాడు.

అంతలోకే పోలీసతనిని చేయి పట్టుకొన్నాడు.

"ఏయ్ ? ఎవర్నివ్? "

"నేనా ? ? ? హంతకుడను."

"ఎవర్ని హత్యచేశావ్? "

"ఒక స్త్రీని."

"ఈ విషయం కోర్టులో చెబుతావా ? "

"ఎందుకు చెప్పను ? "

"అయితే నిన్ను హారెస్టు చేశా."

"ధన్యుడ్ని. ఈ బొందెలోనుంచి ఈ ప్రాణాలెప్పుడు లేచిపోతాయా అని చూస్తున్నా. ఆ పుణ్యం కట్టుకో బాబు" అంటుంటే గోవింద్ చెయ్యి పట్టుకొని ఆ పోలీసు మహాశయుడు తీసుకువస్తున్నాడు. అంతలో నలుగురు పండిట్ జీతాలూకు వాళ్ళు ఆ త్రోవను వెళుతున్నట్లు వెళ్ళి—ఒక్క పోటుతో పోలీసుని నేల కూల్చారు. ఆ ఇసుకపైనే కొన్ని నెత్తుటి బొట్లు—వారి పాదాలతో ఇసుక ముసుగువేశా రా నెత్తురుకు.

అంతే—

ఆ పవిత్రమూర్తి అనూరాధ ప్రక్కనే, అతడ్ని కూడా కలిపివేశారు. సముద్రం ఒక్కసారి హుంకరించింది. హత్యల్లో అలవాటు పడిన వాళ్ళకి హుంకారాలు ఒక లెఖా!

"పాపులకు శిక్ష; పాపానికి అంతూలేదా ప్రభూ!" అనుకుంటూ ఆ రాంబందుల్లో ఒక రాజహంసలా మన గోవింద్ వెళ్లిపోయాడు. ఎవరిల్లు వారు చేరుకున్నారు.

♦ ♦ ♦ ♦

పండిట్ జీ ఇంటివద్ద మాధవి బెంగతో మంచం పట్టింది. రోజు రోజుకూ క్షీణించి పోతూంది. మందుమాకులు ముట్టదు. తన పతి దురంతాలు తలుచుకుంటూ ఉంటే ఆమె గుండె బద్దలై పోతూంది.

రెండు శవాలూ సముద్ర సమాధి పొందాక, గోవింద్ మాధవి దగ్గరకు వెళ్లాడు. పండిట్ జీ ఇంకా ఇంటికి రాక పోవడంచూచి గోవిందుని మేడమీదకు పిలిచింది.

"ఏం తల్లీ!"

"ఇదిగో-ఈ వీలు తీసికో, బాబూ! నేనింక ఎన్నాళ్లో బ్రతకలేను. నా ఆస్తి అంతా నీపేర వ్రాసేసా. నీ యిష్టం వచ్చినట్లు ఉపయోగించుకో."

ఆమె కనులనిండిన నీటితో కన్నబిడ్డకు తన ఆస్తి నంతా అప్పగించినట్లు అప్పగించింది.

అతడు వణికే చేతులతో అందుకున్నాడు. చదువు కున్నాడు. దానిమీదే కొన్ని కన్నీళ్ళు రాల్చాడు.

"తల్లీ! కన్న బిడ్డకంటే ఎక్కువ గారాబంగా చూచు కుంటున్నారు. మీ ఋణం ఎలా తీర్చుకొగలను తల్లీ! వచ్చే జన్మలోనైనా నీకడుపున పుడతానమ్మా......కాని ఈఆస్తి నేభరించ లేను తల్లీ! బ్రతకడానికి కావలసిన ఆస్తి కంటే ఎక్కు వుంటే, అహంకారం, అధికార గర్వం, వ్యామోహం

మొదలగు దుర్గుణాలెన్నో కలుగు తాయమ్మా! ఈడబ్బంతా ఏ స్త్రీ విద్యాసంస్థకో వ్రాయండి. వాళ్ళు సద్వినియోగం చేస్తారు...మీరు వేరుగా తలచకం డమ్మా!'' అంటూ అతడా మెకు తిరిగి ఆవీలు ఇచ్చేశాడు. అతనికి గల ప్రజాభి మానా నికి ఆమె చాలా ఆశ్చర్య పోయింది.

"గోవింద్! పండిట్ జీ ఇంకా రాలేదా? "

"లేదమ్మా! ఇంతలో వచ్చేటట్లు కనబడదు? "

"ఏం? కొత్తహత్యల కేమైనా వలలు పన్నుతున్నారా?"

"వలలు పన్నడం ఏమిటితల్లీ! ఇద్దరప్పుడే అయిపోతే."

"ఆ "

" అనూరాధ- అమహా పవిత్ర మూర్తి అయ్యగారి రివాల్వరుకు గురి అయిపోయింది. "

"ఆమె...ఆ ఎంత దుర్మార్గం. "

ఆమె లేచి కూర్చుంది.

అంతకు ముందే అక్కడకువచ్చి తలుపు మాటునుంచి ఆమాటలన్నీ వింటున్న పండిట్ జీ ఆగ్రహం ఆపుకో లేక పోయాడు.

"ఓరి కృతఘ్నుడా - 'దేశద్రోహీ' - హంతకుడా - నామీద లేనిపోని వన్నీ కల్పించి నాభార్యతో చెప్పి దాని మనసు పాడుచేస్తా ? " అని గోవిందుని జుట్టుపట్టు కొని ఒక్క తాపు తన్ని యు కొట్టాడు.

గోవింద్ ఏమీ మాటాడ లేదు.

మాధవి వెంటనే లేచి అతనికి అడ్డుగా వెళ్ళింది.

వెంటనే పండిట్ జీ రివాల్వర్ తీసి పేల్చేశాడు.

అంతే-

నెత్తుటి ముద్దలా పడిపోయిందామె శరీరం.

అతడు చూచాడు. కన్నులు చెదిరి పోయాయ్.

చేతిలో రివాల్వర్ నేల జారి పోయింది.

తల బద్దలై పడిపోయిందెవరు? కన్న బిడ్డవంటి గోవిందుని రక్షించ డానికి అడ్డుగా వెళ్లిన మాధవి.

హంతకుడు తన స్వహస్తాలతో తన భార్యను హత్య చేశాడు, అది దాగదింక. అతనికి ఉరిశిక్ష తప్పదు. ఇప్పుడేమిటి కర్తవ్యం?

పండిట్‌జీ గడగడ వణికి పోతున్నాడు.

గోవింద్ అతని దగ్గరకు నెమ్మదిగా వెళ్ళాడు. జారిపోయిన రివాల్వర్ పండిట్‌జీకి అందిస్తూ" నాడు రక్షించిన తల్లే నేడు ప్రాణాలిచ్చి మరీ రక్షించింది. ఇది నాకు రక్షణ కాదు; శిక్ష ఈరివాల్వర్ తీసికొండి. మాఅమ్మతో నన్నూ చంపివేయండి. మాఅమ్మ లేనిదే నేను బ్రతుకలేను" అంటూన్న గోవింద్‌ను చూచాడు.

పండిట్‌జీ కన్ను తెరు పెక్కాయ్,

"గోవింద్? ఇంకా నన్ను పాతకుని చెయ్యకు...ఇప్పుడెలా?"

"మీరు బ్రతకాలంటే మార్గాలు లక్షలు."

"చెప్పవూ?"

గోవింద్ ఏమీ మాటాడకుండా ఆమెను లేవనెత్తి మంచం మీద పండుకో పెట్టి తెల్లదుప్పటి కప్పాడు.

"ఏమిటిది గోవింద్?"

"హత్యవిషయం దాచివేద్దాం. అమ్మగారికి గుండెలో నొప్పిగా ఉన్నట్లు ఇద్దరుడాక్టర్లను రప్పించండి. వారికి తలోక వెయ్యా సమ్మరించండి. దహన క్రియలు చేద్దాం అంతవరకు లోపలికి ఎవ్వరినీ రానియ్యకుండా నేను కాపలా ఉంటాం."

"నిత్తుటి బట్టలో"

"నేమారుస్తాగా."

"అలాగే - జాగ్రత."

* * * *

ఆరోజు సాయంకాలమే ఒక దేశనాయకుడు వస్తున్నాడు. పండిట్ జీ వెళ్ళాలి. ఏంచేస్తాడు? వెళ్ళాడు. భార్యకు చాలా జబ్బుగాఉందని చెప్పి ఉపన్యసించాడు. అతని దేశభక్తికి అంతా మెచ్చుకున్నారు......కాని శారద మాత్రం అతని వైపు ఒక కన్ను వేసేఉంది- అనూరాధ రాకపోవడం ఆమెకు అనుమానం కలిగించకపోలేదు...జరిగిన విషయాలు తెలుసుకుంటానికి ప్రయత్నిస్తూంది.

* * * *

ఆరాత్రి అఖండంగా మీటింగ్ జరిగింది. నూతన దేశభక్తుని, పండిట్ జీని ఊరేగిస్తూన్నారు. ఊరేగింపు పండిట్ జీ ఇంటిముందు నుంచి వెళుతూంది గోవింద్ మేడమీద నుంచీ చూచాడు.

"దేశభక్త- ప్రజాసంరక్షక పండిట్ జీకి జై-పండిట్ జీకి జై" అంటున్నారు దేశభక్తులు. పైనున్న గోవింద్ పళ్ళు పట పటా కొరకాడు. గదిలోకి వెళ్ళి చూచాడు. మాధవి పెదవులు బిగుసుకు పోయాయ్.

"అమ్మా! చూచావా? దేశభక్తుడా? కాదు - 'దేశద్రోహి'— ప్రజాసంరక్షకుడా? కాదు-ప్రజా సంహారకుడు- అంటూ పళ్ళు పటపట కొరకాడు-

ఏదెలా గుంటేనేం?

వీధిలో ఊరేగింపు; ఇంటిలో అర్ధాంగి హత్య.

♦ ♦ ♦ ♦ ♦

వేలాగైతే డాక్టర్లను పిలిపించాడు. నలుగురికి జబ్బుని చాటించారు. మాధవిని తగల పెట్టించారు......

పండిట్‌జీ మనసు కుదుటబడింది. గోవింద్ హృదయం అగ్ని గుండంలా మండి పోతూంది. అది కనిపెట్టాడు పండిట్‌జీ. పాముని పాలుపోసి పెంచకూడదను కున్నాడు: ఎప్పటికైనా తన హత్యలు లోకానికి చాటిస్తాడను కున్నాడు...

నల్లాళ్లు చూచాడు. నెమ్మదిగా ఇతరులచేత గోవిందే ఆనాటి రాత్రి స్త్రీని హత్యచేసిన హంతకుడని పోలీసువారికి చెప్పించాడు. ఇంకేముంది? పోలీసువారు 'హారెస్టు వారెంట్ పెట్టి అతసిని పట్టుకొన్నారు.

గోవింద్ వెళుతూ వెళుతూ మాధవి చిత్రం చూచి నమస్కరించి "అమ్మా! నీదగ్గరకే వస్తున్నా. నీసేవ అక్కడే చేస్తా" అని హృదయం కరిగేటట్లు కన్నీటితో ప్రార్థించాడు.

పండిట్ జీ అదిచూచాడు. అతనిభక్తికి ఆశ్చర్యపోయాడు. తరువాత గోవింద్ పండిట్ జీ రెండు పాదాలపై సాష్టాంగపడి " నాన్నగారూ! నన్నానాడు రక్షించారు; ఈ నాడు విధి శిక్షిస్తూంది. నేను ఆనందంగా శిక్ష ననుభవింప బోతున్నా...కాని ఒక ప్రార్థన. కన్నతల్లి పోయింది; పెం

చిన తల్లీ పోయింది; కన్నతండ్రీ పోయాడు. నాకెవ్వరు లేరు. అందరిప్రేమా మీలో దాచుకొని నన్ను నేటివరకూ కన్న కొడుకులా కాపాడారు. నారుణం ఏవిధంగానూ తీర్చుకోలేపోయాను. నిజానికి తీర్చుకో లేను...కాని తెలియక నేను చేసిన తప్పులు మనసా క్షమించి, మృత్యు మందిరానికి భక్తితో ప్రయాణంచేయడానికి నన్ను దీవించ ప్రార్థన... సెలవు..." అంటూ లేచాడు.

గోవింద్ కళ్లనుండిన నీళ్లు పాదాలపై పడ్డాయ్- పండిట్ జీ పాపాలన్నీ కడిగేయ డానికో అన్నట్లు-

గోవింద్ తలవంచుకొని బయలు దేరాడు. ఇల్లుదాటాడు. పండిట్ జీ నోట మాట రాలేదు. శవంలా కొంతసేపు బిగుసుకు పోయాడు...వెంటనే నూతన శక్తికోసం లోపలకు వెళ్ళి బ్రాందీ బోటిల్ పైకెత్తి గడగడ త్రాగేసి "హేభగవాన్? " అంటూ పక్కపై సోలి పోయాడు.

అది న్యాయస్థానం.

న్యాయాధిపతి, ప్లీడర్లు, పెద్దలంతా కూర్చున్నారు. గోవింద్ బోనెక్కి సత్యాన్ని పలుకుతానని ప్రమాణం చేసిన తరువాత ప్లీడరిలా ప్రశ్నించాడు.

"నీ పేరు? "

"గోవింద్ అని ఉన్నదే? "

"అలామారుపేరు పెట్టుకొని నేనింతకాలం తిరిగాను.'

"ఎందుకు? "

"ప్రభుత్వం కళ్ళ పడకుండా తప్పించు కుంటానికి. "

"సరే నీవు హత్య చేశావా? "

"చేశాను."

"ఆమెకూ నీకూ ఏమి సంబంధం?"

"ఆమె నాకు భార్య; నేనామెకు భర్తను. ఇరువురకూ భార్యా భర్తల సంబంధం."

కోర్టంతా గొల్లుమని నవ్వారు.

ప్లీడరు వళ్ళు మండింది.

"ఏయ్! ఏమిటా పొగరుబోతు జవాబు?"

"పొగరు పోయింతరువాతే బోనెక్కానండి. పొగరున్నంతకాలం మీరు పేరుతో దొరలకు కనబడకుండానే తిరిగాను."

"అయితే నీకామెపై ఏమైనా అనుమానం ఉందా?"

"ఏమీ లేదండి. ఆమె మహాపతివ్రత."

"మరి ఎందుకు చంపావ్?"

గోవింద్ దానికి జవాబు చెప్పలేపోయాడు. అతని కన్నులపై కన్నీటిధార జారిపోయింది. జడ్జీగారు చూశారు.

"చెప్పవోయ్. భయంలేదు" అన్నారు.

గోవింద్ కన్నీళ్ళు తుడుచుకొని ఇలా చెప్పాడు.

"ప్రభుత్వంవారు విశ్వసిస్తారో, విశ్వసించరో తెలియదు. కాని సత్యాన్నే చెబుతానని ప్రమాణం చేశానని చెప్పాను కాబట్టి, సత్యాన్ని పలకడం మానవ విధి. కాబట్టి నేను మానవునిగా మరణించాలనే కోరిక ఉన్నది కాబట్టి చెబుతున్నాను... ఆమెను పెళ్ళాడాను, కాని పోషించలేక పోయాను. నేను బి.ఏ. వరకూ చదువుకున్నా. పరీక్ష తప్పా. ఏలాగూ సంపాదించుకోలేపోయా...సంపాదించినా చాల

లేదు, మా దరిద్రానికి తోడు ఇద్దరు పిల్లలు కలిగారు. దానితో సంసారం ఈదలేకపోయాను నా భార్యా బిడ్డలను పోషించలేక బెంగతో మంచం పట్టింది. తినడానికి గంజి నీళ్లైనాపోయలేని నేను మందుమాకులను తేలేపోయాను... ఇలా దినదినం క్షీణించుకుపోయే భార్యను, ఆకలిదప్పులకు సహించలేని బిడ్డలను చూచి బ్రతకలేపోయాను...నాభార్యా కార్చే కన్నీరు చూడలేక, ఏవిధంగానూ పోషించే మార్గం కనుపించక - ఒకనాటి రాత్రి పన్నెండు గంటలకు కత్తితో ఆమెను పొడిచి చంపాను..."

అతడు దానితో ఆగిపోయాడు.

కోర్టువారంతా ఆశ్చర్యపోయారు.

"అయితే ఆ ఇద్దరు పిల్లలూ ఏరి బాబూ!" అని జాలిగా ప్రశ్నించాడు. న్యాయాధిపతి.

గోవింద్ కన్నీళ్ళుతుడుచుకొని ఇలా ప్రారంభించాడు.

"ప్రభూ! బిడ్డల ఏడుపులు చూడలేని నేను వారిని తీసుకొని ఒకరాత్రి ఒక బంధువు ఇల్లు జేరా. అక్కడ రెండు రోజులుంచా. కాని వారెంతో నీచంగా చూడడం ప్రారంభించారు. దానితో మరోరాత్రి వారిని తీసుకొని ప్రళయమూర్తిలా బయలు దేరా...వాళ్లిద్దరితోపాటు నేనూ ట్రయిను క్రింద పడి మరణించాలనుకున్నా. నిదరపోయేవారిని పట్టాల మీద పరుండబెట్టి - స్మృతి వచ్చాక ఏడుస్తున్నా ఇద్దర్నీ పట్టుకొని విడువకుండా నేనూ పట్టాలపై పండుకున్నా.

కాని ట్రయిను వచ్చేస్తూంటే "నేను చస్తే నాభార్యా గతి ఏమిటి!" అనే పిరికిభావం కలిగింది. ఏంచెయ్యానా అని

ఆలోచిస్తున్నా. ట్రయిను వచ్చేసింది. నాకు ప్రాణభీతి హెచ్చింది. ఇంజన్‌డ్రయివర్ విజిల్ వేయించాడు. నా హృదయం ఝుల్లుమంది-వెంటనే నేనులేచి పోయాను...

............ప్రభూ! ఏంచెప్పను. నాఇద్దరు కన్న బిడ్డలు ట్రయిను క్రింద పడి చిదికి పోయారు. ఆపట్టాల కంటిన వారినెత్తురైనా చూడలేక నేను పారిపోయాను ... ... నాభార్యా, 'బిడ్డలేరీ?' అని అడిగితే 'సుఖంగా ఉన్నారు' అని అబద్ధం ఆడాను.

ఆరోజు చావాలన్నా చావలేక పోయిన నేను, తిరిగి ధైర్యం తెచ్చుకొని భార్యాను చంపి అయినా చావాలను కున్నా. భార్యాను చంపాను. ఏంలాభం-నాకు తెలియకుండానే ప్రాణభీతి నన్ను ఆవరించింది-పరుగు పెట్టాను 'హత్యా-హత్య' అని కేకలు వేస్తూ......

ప్రభూ ! ఆనాటినుంచీ ఈనాటి వరకూ చావడానికి శక్తిలేని ఈహంతకుని చంపి పుణ్యం కట్టుకుంటారని ప్రార్థిస్తున్నాను." అన్నాడు.

అంతా ఒక్క నిట్టూర్పు విడిచారు.

♦ ♦ ♦ ♦

"హత్య రుజువైనవుడు హంతకునకు మరణ దండమే శాసనము. కాన ఉరి విధించడమైనది" అని జడ్జీగారు జ్యూరీ సమ్మతం తీసుకొని శాసించారు.

గోవింద్ ఆనందంతో బోనుదిగి పోలీసులతో ఖయిదు లోకి వెళ్ళాడు.

♦ ♦ ♦ ♦ ♦

"ఆరోజు [redacted]రోజు."

"నీ తుది కోరిక కోరుకో" మన్నారు ప్రభుత్వంవారు. అత డతిశాంత గభీరుడై ఇలా కోరుకున్నాడు.

"పేదలూ - పెన్నిధులూ అనే భేదం లేకుండా మా భరతమాత ప్రజలనందరినీ సమత్వంతో పాలించే శుభదినం రావాలి-అనేదే నా తుదికోరిక. భగవానుడు నాకోరిక నెర వేర్చుగాక."

గోవింద్ కళ్లు ము నుకున్నాడు. సిద్ధపడ్డాడు ఉరికి.

* * * * *

గోవింద్ గుక్కెడు ప్రాణాలూ బొందినుండి వేరయ్యాయ్ హంతకుడని నిర్మలుడైన గోవిందుని వధించిన ప్రభుత్వం ' హంతకుడని-దుష్టుడు, -'దేశద్రోహి' - అయిన పండిట్ జీని వధించలేక పోయింది-అతడానందం అనుభ విస్తూనే ఉన్నాడు. పేరు ప్రఖ్యాతులు ఆర్జిస్తూనే ఉన్నాడు. మేడలు కడుతూనే ఉన్నాడు...కాని తినతిండిలేని మన గోవిందుల కేలోకంలో తావులేదు. న్యాయం ఎక్కడుంది?

ఒక భర్తరాలి కుంకుమబొట్టు నెత్తుటిబొట్టులో కలిసిపోయింది
ఒక ఇల్లాలి మంగళసూత్రం నెత్తుటి బురదలో తడిసిపోయింది
ఒక సేవకుని జీవితగాథ సముద్ర సమాధిలో కలిసి పోయింది
ఒక దేశభక్తుని ఆకలిమంట ఉరికొయ్యలో చిక్కుకు పోయింది

కాని—మన 'దేశద్రోహి' ఇంకా 'దేశభక్తునిగా' 'ప్రజా సంరక్షకునిగా' దేశంలో చెలామణి అవుతున్నాడు—

న్యాయానికి కళ్ళులేవా ? దేవునకు నీతి లేదా ?
మృత్యువునకు ధర్మంలేదా ? దేశద్రోహులకు శిక్షలేదా ?

Printed at Orient Press, 6583 Market Street, Secunderabad

"ఆరోజు [illegible] నిరోజు."

"నీ తుది కోరిక కోరుకో" మన్నారు ప్రభుత్వంవారు. అత డతిశాంత గంభీరుడై ఇలా కోరుకున్నాడు.

"పేదలూ - పెన్నిధులూ అనే భేదం లేకుండా మా భరతమాత ప్రజలనందరినీ సమత్వంతో పాలించే శుభదినం రావాలి-అనేదే నా తుదికోరిక. భగవానుడు నా కోరిక నెర వేర్చుగాక."

గోవింద్ కళ్లు మూసుకున్నాడు. సిద్ధపడ్డాడు ఉరికి.

* * * * *

గోవింద్ గుక్కెడు ప్రాణాలూ బొందినుండి వేరయ్యాయ్ హంతకుడని నిర్మలుడైన గోవిందుని వధించిన ప్రభుత్వం 'హంతకుడని-దుష్టుడు, -'దేశద్రోహి' - అయిన పండిట్ జీని వధించలేక పోయింది-అతడానందం అనుభవిస్తూనే ఉన్నాడు. పేరు ప్రఖ్యాతులు ఆర్జిస్తూనే ఉన్నాడు. మేడలు కడుతూనే ఉన్నాడు...కాని తినతిండిలేని మన గోవిందుల కేలోకంలో తావులేదు. న్యాయం ఎక్కడుంది?

ఒక భర్తరాలి కుంకుమబొట్టు నెత్తుటిబొట్టులో కలిసిపోయింది
ఒక ఇల్లాలి మంగళసూత్రం నెత్తుటి బురదలో తడిసిపోయింది
ఒక సేవకుని జీవితగాథ సముద్ర సమాధిలో కలిసి పోయింది
ఒక దేశభక్తుని ఆకలిమంట ఉక్కుకాళ్ళలో చిక్కుకు పోయింది

కాని—మన 'దేశద్రోహి' ఇంకా 'దేశభక్తునిగా' 'ప్రజా సంరక్షకునిగా' దేశంలో చెలామణి అవుతున్నాడు—

న్యాయానికి కళ్ళులేవా ? దేవునకు నీతి లేదా ?
మృత్యువునకు ధర్మంలేదా ? దేశద్రోహులకు శిక్ష లేదా ?

Printed at Orient Press, 6583 Market Street, Secunderabad